

అయోధ్యలో పూజలను స్క్రీన్‌పై చూసి పులకించిపోతున్న భక్తులు

# జై శ్రీరామ్!

- బాలరాముని ప్రతిష్ఠతో పులకించిన భక్తజనం
- వాడవాడలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- ఇళ్లలో దీపాలు వెలిగించి, అక్షతలు చల్లుకున్న ప్రజలు

ఒంగోలు (కల్చరల్), జనవరి 22 : అయోధ్యలోని శ్రీరామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు ఎన్నో ఏళ్ల కల సాకారమవుతున్న శుభతరుణాన్ని టీవీలు, ఎల్‌ఈడీ స్ర్కీన్‌లపై చూస్తూ పులకించిపోయారు. శ్రీసీతారామ కల్యాణాలు, శోభాయాత్రలు, రథయాత్రలు నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో ఆనందపరవశులయ్యారు. సోమవారం మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో రామ్‌లల్లా విగ్రహాన్ని ప్రధాని మోదీ ప్రారంభించగా ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలను ప్రజలు తమ ఇళ్లలో టీవీల ద్వారా తిలకించారు. మరోవైపు ఆ సుందర దృశ్యాన్ని అందరూ చూసే విధంగా విద్యాలయాలు, పలు దేవాలయాలు, ఆధ్యాత్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. నిత్యం రాజకీయాల గురించి చర్చించుకునే అనేకమంది సోమవారం మాత్రం ఎక్కడచూసినా శ్రీరామ ఉత్సవం గురించే మాట్లాడుకోవడం కనిపించింది. ఇక రాత్రికి ఇళ్లలో, దేవాలయాల్లో దీపాలు వెలిగించి, అయోధ్య నుంచి తెచ్చి ఇంటింటికీ పంపిణీ చేసిన అక్షతలను తలపై చల్లుకున్నారు.



కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో శ్రీరామునికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, మహిళలు



ఒంగోలులో రామకథ నృత్య నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



దోర్నాలలో సీతారాముల విగ్రహాల గ్రామోత్సవం



అయోధ్య ఆలయం ఆకారంలో వేసిన ముగ్గు వద్ద జైశ్రీరామ్ అంటున్న భక్తులు

# వైసీపీలో కొనసాగుతున్న రగడ

- ఒంగోలు ఎంపీ, గిద్దలూరుపై కొలిక్కిరాని మంతనాలు
- నేడో, రేపో ప్రకటన అంటున్న అధిష్ఠానం
- ఎంపీ సీటు కాకుంటే నాదారి నాదే అంటున్న మద్దిశెట్టి
- నాకు కాకుంటే నారాయణనూ తొలగించాలి : బుర్రా
- ప్రత్యామ్నాయంపై కదిరి సమాలోచనలు




(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై ఆరంభమైన రగడ మరింత పెరుగుతోంది. కొత్త ఇన్‌చార్జిలను ప్రకటించిన నియోజకవర్గాల్లో పరిస్థితులు కుదుటపడకపోగా ఒంగోలు ఎంపీ, గిద్దలూరు అసెంబ్లీ ఇన్‌చార్జిల నియామకంపై ప్రతిష్టంభన నెలకొంది. గిద్దలూరు టికెట్ ఆశిస్తున్న నాయకులతో హైదరాబాద్‌లో మంతనాలు జరిపిన బాలినేని తుది నిర్ణయాన్ని అధిష్ఠానంకు చెప్పలేదని తెలుస్తోంది. ఒకదశలో ఉన్న పరిస్థితిని సాయిరెడ్డికి మాత్రం వివరించినట్లు కూడా సమాచారం. నియోజకవర్గానికి చెందిన ఆరేడుమంది నాయకుల్లో ఏకాభిప్రాయం రాకపోవడంతో ఇంకాస్త లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించుకుని మంగళ లేక బుధవారాల్లో తుదినిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.

### ఎంపీ స్థానం కోసమే మద్దిశెట్టి పట్టు

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌తో ఆదివారం రాత్రి, సోమవారం కూడా కొందరు పార్టీ నాయకులు మాట్లాడినట్లు తెలిసింది. దర్శిలో బూచేపల్లికి ఆయన సహకరించరన్న ఉద్దేశంతో శాంతింపజేసే చర్యల్లో భాగంగా కొన్ని ఆశలుపెట్టినట్లు తెలుస్తోంది. తదనుగుణంగా ఒంగోలు ఎమ్మెల్యే సీటు అయినా ఇస్తాం వెళ్లండంటూ కొందరు సూచించినట్లు సమాచారం. బాలినేని కూడా రంగంలో ఉంటారని ఎంపీనా లేక గిద్దలూరునా అనేది జగన్ నిర్ణయిస్తారని, మీరు ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఒక నాయకుడు మద్దిశెట్టికి ఫోన్ చేసినట్లు సమాచారం. అయితే మద్దిశెట్టి దర్శి మినహా ఎక్కడా ఎమ్మెల్యేగా పోటీచేయనని, ఒంగోలు ఎంపీ టికెట్ కావాలని మరోసారి కోరారు. లేకపోతే తనదారి తాను చూసుకుంటానన్న తరహాలో ఆయన సంకేతం ఇచ్చినట్లు తెలిసింది. కాగా మద్దిశెట్టి నుంచి ఎలాంటి సహకారాన్ని కోరకుండా ఆయన అనుచరులపై బూచేపల్లి ఒత్తిడి పెంచటాన్ని ఎమ్మెల్యే వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అదేవిషయాన్ని మద్దిశెట్టికి ఫోన్‌చేసి చెప్పి మీరు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది.

### బుర్రా కొత్త డిమాండ్

కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సోమవారం హైదరాబాద్‌లో బాలినేనిని కలిశారు. తొలుత తాను గతంలో మాదిరిగానే నడుస్తానని తనకు తిరిగి అవకాశం ఇప్పించాలని కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ప్రకటించిన నారాయణయాదవ్‌ను తొలగించాలని గట్టిగా కోరినట్లు సమాచారం. అప్పటికే బాలినేని వద్ద ఉన్న ఆ నియోజకవర్గానికి చెందిన కొందరు బుర్రా వ్యతిరేక వర్గీయులు ఆయన (బుర్రా) టీడీపీ వైపు చూస్తున్నారని, మరోసారి ఆయనకు అవకాశం ఇస్తే తాము పార్టీకి గుడ్‌బై చెబుతామని బాలినేనికి చెప్పినట్లు సమాచారం. కాగా ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పరిశీలనలో ఉన్న సత్యనారాయణరెడ్డి కూడా సోమవారం బాలినేనిని కలవటంతోపాటు అక్కడకొచ్చిన బుర్రా, ఆయన మాట్లాడుకోవడం శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. నిన్నమొన్నటి వరకు కత్తులు దూసుకున్న వారు కలిసి మాట్లాడుకోవటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### కదిరి సమాలోచనలు

కనిగిరి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు ప్రత్యామ్నాయ రాజకీయం వైపు దృష్టిసారించి సమాలోచనలు ప్రారంభించారు. స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేద్దామా, తిరిగి టీడీపీ గూటికి చేరుదామా అన్న అంశాలపై ఆయన దృష్టిసారించినట్లు తెలిసింది. తన మిత్రుడైన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారం కూడా ఉన్నందున కనిగిరి కాకపోయినా వేరేరూపంలో టీడీపీ నుంచి సహకారం లభిస్తే అందిపుచ్చుకోవాలన్న ఆలోచనలో కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా కనిగిరిలో వైసీపీకి సహకరించకూడదని, రెండుమూడు రోజుల్లో తుదినిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనకు ఆయన వచ్చినట్లు ముఖ్య అనుచరులు చెబుతున్నారు.

# జగమొండి

## సమ్మెలో ఉన్న అంగన్‌వాడీల తొలగింపు

అంగన్‌వాడీల సమ్మెపై ఆది నుంచి మొండివైఖరిని అవలంబిస్తున్న రాష్ట్రప్రభుత్వం అనుకున్నట్లుగానే పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించింది. డిమాండ్ల సాధన కోసం 42రోజులుగా పోరాటం చేస్తున్న కార్యకర్తలు, ఆయాలను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. తొలుత ఎస్మాను ప్రయోగించి అంగన్‌వాడీల సమ్మెను ఆపాలని చూసింది. అయినా బెదరకపోవడంతో వారి పొట్టకొట్టింది.

- జిల్లాలో 3,301మంది కార్యకర్తలు, ఆయాలకు ఉద్వాసన
- ఉద్యోగం నుంచి తీసివేస్తున్నట్లు నోటీసులు
- ఆ ఖాళీల్లో కొత్తవారి నియామకానికి 25న నోటిఫికేషన్
- రేపు బంద్‌కు పిలుపునిచ్చిన కార్మిక, ప్రజాసంఘాలు
- పోస్టుల తొలగింపును అడ్డుకుంటాం.. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఒంగోలు నగరం, జనవరి 22 : ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని 3,301 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ మేరకు వారికి నోటీసులు జారీచేసే ప్రక్రియను ఐసీడీఎస్ అధికారులు చేపట్టారు. డిమాండ్ల సాధన కోసం 42రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్న విషయం విదితమే. ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా నోటీసులకు బెదరకుండా వారు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే విధుల్లో చేరాలని ఎస్మాను ఉటంకిస్తూ అధికారులు కార్యకర్తలు, ఆయాలకు నోటీసులు ఇచ్చారు. వాటిలో పేర్కొన్న గడువు ముగిసింది. దీంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. ఈలోగా అంగన్‌వాడీలు ఉద్యమాన్ని విజయవాడపై కేంద్రీకరించారు. జిల్లా నుంచి కూడా వేలాదిమంది కార్యకర్తలు, ఆయాలు విజయవాడ తరలివెళ్లారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. వందలాది మందిని అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఒంగోలుతోపాటు విజయవాడ వైపు ఉన్న అనేక స్టేషన్లకు అంగన్‌వాడీలను తరలించారు. విజయవాడలో ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేశారు. ప్రభుత్వం ఒకవైపు ఉప్పెనలా తరలివస్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్టులు చేయిస్తూనే, మరోపక్క వారిని ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలని జిల్లాలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.



ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో ఉన్న కార్యకర్తలు, ఆయాలు

### జిల్లాలో 3,301మంది ఉద్యోగాల నుంచి తొలగింపు

జిల్లాలో మొత్తం 5350 మంది కార్యకర్తలు, ఆయాలు ఉండగా వీరిలో 2,049మంది విధుల్లో చేరినట్లు అధికారులు చెబుతున్నారు. ఎస్మాను ప్రయోగించినా, నోటీసులు జారీచేసినా విధుల్లో చేరని 3,301 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ మాధురి తెలిపారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించేందుకు కూడా ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని ఆమె తెలిపారు. ఈనెల 25వతేదీనే నోటిఫికేషన్ జారీ చేసి కొత్తవారిని నియమించే ప్రక్రియను చేపడతామని తెలిపారు.



మార్కాపురంలో అంగన్‌వాడీల నిరసన శిబిరం టెంట్‌ను తొలగిస్తున్న పోలీసులు

### రేపు బంద్‌కు పిలుపు

రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీలను ఉద్యోగం నుంచి తొలగించటాన్ని, ఉద్యమాన్ని అణచివేసే దిశగా నిరంకుశంగా వ్యవహరించటాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, అంగన్‌వాడీ యూనియన్లు బుధవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ఈ బంద్‌ను జిల్లాలో కూడా విజయవంతంగా నిర్వహించేందుకు కార్మికసంఘాల నాయకులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మొండివైఖరిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే దిశగా వారు సిద్ధమయ్యారు.

### తొలగింపును అడ్డుకుంటాం

ప్రభుత్వం తమను ఉద్యోగాల నుంచి తొలగించాలని చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా పోరాటం ఆపేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఘంటాపథంగా చెబుతున్నారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మరింత ఉద్యమించి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అంటున్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించే విధంగా ఆందోళనను రూపొందిస్తున్నామన్నారు.

### ముందస్తు అరెస్టులు.. వెయ్యి మందికి నోటీసులు

ఒంగోలు(క్రైం), జనవరి 22: అంగన్‌వాడీల ఆందోళనపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి కట్టడి చేశారు. దాదాపు 1000 మంది కార్యకర్తలకు ముందస్తు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కడప, తిరుపతి ప్రాంతాల నుంచి విజయవాడ వెళుతున్న 16 మందిని అదుపులోకి తీసుకొని టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. మార్కాపురం, వైపాలెంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసుకున్న నిరసన శిబిరాలను పోలీసులు బలవంతంగా తొలగించారు. అదేవిధంగా జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు చేసి 18 మందిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# జిల్లాలో ఓట్లు 17,99,706

- గతేడాది కంటే స్వల్పంగా పెరుగుదల
- అదనంగా 19,561 ఓట్లు చేర్పు
- పురుషుల కంటే మహిళలవే అధికం
- తుదిజాబితాను ప్రకటించిన కలెక్టర్

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 22 : ఓటర్ల తుదిజాబితా విడుదలైంది. జిల్లాలో 17,99,706 మంది ఓటర్లు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల మార్పులు,చేర్పుల అనంతరం సోమవారం జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తుది జాబితాను ప్రచురించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గతేడాది జనవరి 5తేదీన ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో 17,86,603 ఓట్లు ఉండగా, ముసాయిదా జాబితాలో 17,80,145 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం ప్రకటించిన తుది జాబితాలో 17,99,706 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది స్వల్పంగా పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 19,561 ఓట్లు పెరిగాయి. పురుషుల కంటే మహిళా ఓట్లే 5,890 అధికంగా ఉన్నాయి. నాలుగు నియోజకవర్గాల్లో పురుషులవి, మరో నాలుగు నియోజకవర్గాల్లో స్త్రీల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో 2,37,079 ఓట్లతో కనిగిరి ప్రథమస్థానంలో ఉంది. వైపాలెం నియోజకవర్గంలో అత్యల్పంగా 2,05,300 ఓట్లు ఉన్నాయి. జిల్లాలో మహిళా ఓట్లు అత్యధికంగా ఒంగోలు నియోజకవర్గంలో 1,22,549 ఓట్లు ఉండగా, అత్యల్పంగా వైపాలెంలో 1,01,077 ఉన్నాయి. జిల్లాలో పురుషుల ఓట్లు అత్యధికంగా కనిగిరిలో 1,19,906 ఉండగా, అత్యల్పంగా వైపాలెంలో 1,04,222 ఉన్నాయి. గతేడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన అనంతరం ఈనెల 5వతేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఇంకోవైపు గత నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. వాటన్నింటినీ పరిష్కరించిన అనంతరం సోమవారం తుది ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఒంగోలులో 748 మంది ఓటర్లు తగ్గగా, దర్శిలో 4,844 మంది, వైపాలెంలో 4,262 మంది ఓటర్లు పెరిగారు. కాగా జిల్లాలో 6,815 మంది సర్వీసు ఓటర్లు ఉండగా అత్యధికంగా గిద్దలూరులో 5,375 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు, ట్రాన్స్‌జెండర్లు గతం కన్నా స్వల్పంగా తగ్గారు. 18-19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఓటర్లు 14,016 మంది పెరిగారు. తాజా జాబితాలో ఆ ఓటర్ల సంఖ్య 36,996గా ఉంది. కాగా 2023 జనవరి 6 నుంచి ఈఏడాది జనవరి 5 వరకు చేర్పులు(ఫాం-6), తొలగింపులు (ఫాం-7), చిరునా మా మార్పు ఇతరత్రా సవరణలు(ఫాం-8)కోసం జిల్లా యంత్రాంగానికి మొత్తం 5,51,870 దరఖాస్తులు అందగా 5,02,308 ఆమోదించారు. 49,562 దరఖాస్తులు తిరస్కరించినట్లు కలెక్టర్ ప్రకటించారు. కాగా తుది ఓటర్ల జాబితా ప్రకటన అనంతరం రాజకీయ పార్టీలకు కలెక్టర్ ఓటర్ల జాబితాలను అందజేశారు. విలేకరుల సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో శ్రీలత పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో శ్రీలత

### అసెంబ్లీ నియోజకవర్గం వారీగా ఓటర్ల వివరాలు

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పురుష ఓటర్లు | మహిళా ఓటర్లు | ఇతర ఓటర్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| వై.పాలెం | 265 | 1,04,222 | 1,01,077 | 01 | 2,05,300 |
| దర్శి | 282 | 1,12,868 | 1,10,807 | 10 | 2,23,685 |
| ఎస్ఎన్‌పాడు | 256 | 1,04,408 | 1,07,944 | 05 | 2,12,357 |
| ఒంగోలు | 259 | 1,13,702 | 1,22,549 | 41 | 2,36,292 |
| కొండపి | 283 | 1,16,747 | 1,19,117 | 02 | 2,35,866 |
| మార్కాపురం | 257 | 1,06,777 | 1,05,288 | 05 | 2,12,070 |
| గిద్దలూరు | 284 | 1,18,229 | 1,18,831 | 19 | 2,37,079 |
| కనిగిరి | 297 | 1,19,906 | 1,17,136 | 15 | 2,37,057 |
| మొత్తం | 2,183 | 8,96,859 | 9.02,749 | 98 | 17,99,706 |





మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న మంచ్ మహిళా ప్రతినిధులు

# వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై వివక్ష

**ర్యాలీలో ముస్లిం జాగరణ్‌మంచ్ అధ్యక్షురాలు హుస్సేన్‌బీ**

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై వివక్షతో పాటు దౌర్జన్యాలు పెరిగిపోయాయని ముస్లిం జాగరణ్ మంచ్ మహిళా అధ్యక్షురాలు షేక్ హుస్సేన్ బీ ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న వివక్షను నిరసిస్తూ సోమవారం స్థానిక ఇస్లాంపేట నాలుగు కూడలి నుంచి అద్దంకి బస్టాండు, ట్రంకురోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో హుస్సేన్ బీ మాట్లాడుతూ మహిళలపై దౌర్జన్యాలు చేస్తే జాగరణ్ మంచ్ ముందుండి పోరాడుతుందని తెలిపారు. రాజ్యాంగ పరంగా మహిళలకు దక్కాల్సిన ఉద్యోగ, ఉపాధి తదితర రంగాల్లో వెనుకబాటుతనాన్ని అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయని ఆరోపించారు. ఆంధ్రా ముస్లిం లీగ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మౌలానా అల్తాఫ్ మురాది మాట్లాడుతూ పసిపిల్లలపై కొనసాగిస్తున్న అత్యాచారాలను నిరోధించేందుకు పోక్సో చట్టం అమలులోకి వచ్చినా ఆగడం లేదన్నారు. మహిళా నాయకురాలు సయ్యద్ నసీమా మాట్లాడుతూ దిశా మహిళా పోలీస్ స్టేషన్లు జిల్లా కేంద్రంలో ఉండటం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి మండల కేంద్రంలో దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జాగరణ్ మంచ్‌రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ బుజ్జి, మేఘావత్ సుగ్రీవ్ నాయక్, షేక్ సల్మా, సీలా, కే మేరీ, షేక్ ఫాతిమా, షేక్ ఖమర్ జహా, షేక్ అమీనా, రజియా, నవనీతం, పోతినేని మారుతిలక్ష్మి, కంచాల సుశీల, యనమల లక్ష్మి తదితరులు ఉన్నారు.


సమావేశంలో పంటల గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న రైతుసంఘం నాయకుడు జయంతీబాబు

# నేటి నుంచి గుండ్లకమ్మ ఎడమకాలువకు సాగు నీరు

● కలెక్టర్ ఆదేశాలు

ఒంగోలు(రూరల్)జనవరి 22: గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి ఎడమకాలువకు మంగళవారం నుంచి నీరు విడుదల చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం మంత్రి మేరుగ నాగార్జున, సీపీఎం రైతు సంఘనాయకులతో సమావేశం జరిగింది. ఈసమావేశంలో రైతు సంఘనాయకుడు జె.జయంత్ బాబు మాట్లాడుతూ గుండ్లకమ్మ ఎడమ కాలువ పరిధిలో 10వేల ఎకరాలు మిర్చిపంట , మరో పదిఎకరాలలో పొగాకు, ఇతర పంటలు సాగులో ఉన్నాయని, ఆ పంటలకు ఒక తడి నీరు ఇస్తేనే పంట చేతి కొస్తుందని వారి దృష్టికి తెచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుతం ఉన్ననీటిని పొలాలకు ఇస్తే ఏమైనా ఇబ్బంది ఉందా అని ప్రాజెక్ట్ అధికారులను ప్రశ్నించారు. పంటపొలాలకు నీరు ఇస్తే తాగునీటికి రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపాలని సూచించారు. దీంతో ప్రస్తుతం పంటలను కాపాడుకోవటానికి నీరు విడుదల చేయాలని కలెక్టర్ ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి నివేదిక పంపి తిరిగి సాగర్ నుంచి గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను నీటితో నింపే ఏర్పాట్లు చేయాలని గుండ్లకమ్మ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె మాబు, మండల రైతు సంఘనాయకులు మారెళ్ల వెంకట్రావు, టి.శ్రీకాంత్, మారెళ్ల అనిల్, పాలపర్తి యోనా, వైసీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


రిమ్స్ ఎదురు రహదారిపై రాస్తారోకో చేస్తున్న యువకుడు తల్లిదండ్రులు, బంధువులు

# యువకుడిది ఆత్మహత్యకాదు హత్యే

● మృతుని తల్లిదండ్రులు, బంధువుల ఆరోపణ
● న్యాయం చేయాలని రిమ్స్ వద్ద ఆందోళన

ఒంగోలు (క్రైం)జనవరి 21: అఖిల్‌ది ఆత్మహత్య కాదు ...కొట్టి చంపారు అంటూ మృతుని తల్లిదండ్రులతో పాటు బంధువులు రోదిస్తూ ఆందోళనకు దిగారు. స్థానిక రిమ్స్ వద్ద రోడ్డుపై బైఠాయించి న్యాయం జరగాలని ఆందోళన చేపట్టారు. వివరాలలోకి వెళితే యరజర్లకు చెందిన చావలి అఖిల్(21) డిగ్రీ వరకు చదుకుని బేల్దారి పనులు చేసుకుంటున్నాడు. అయితే యువకుడికి ఓ యువతితో పరిచయమైంది. ఈ క్రమంలో వారి ప్రేమను యువతి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో అఖిల్ తన స్నేహితులు నివాసం ఉండే స్థానిక భాగ్యనగర్ ఒకటో లైన్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని పోలీసుల కథనం. ఈమేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే సోమవారం అఖిల్ మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా మృతిని తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆందోళనకు దిగారు. అఖిల్ ఆత్మహత్య చేసుకోలేదు.., కొట్టిచంపారని, న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ ఎదురు రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. మృతుని తలపై బలమైన గాయం ఉందని, కానీ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారని వారు ఆరోపించారు. అదేక్రమంలో చిన్న టవల్‌తో ఉరివేసుకునే అవకాశం లేదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో సుమారు గంటసేపు రోడ్డుపైన వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఒంగోలు వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్ ఆందోళనకారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ముగ్గురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నారని విచారిస్తున్నామని బాధితులకు వివరించారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన కేసును విచారిస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా తలపైన గాయం ఉందని అంగీకరించారు. దీంతో సీఐ ఇచ్చిన హామీ మేరకు ఆందోళన విరమించారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : మేడ్ జిల్లా సంఘం ప్రచురించిన ఉద్యోగుల క్యాలెండర్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక స్పందన హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో మేడ్ జిల్లా అధ్యక్షుడు ఎండ్లూరి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు కోలకలూరి ప్రభాకర్, గుండాల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డయల్ యువర్ కలెక్టర్ అనంతరం జరిగిన స్పందనలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అర్జీలను పరిశీలించిన అనంతరం పరిష్కారం కాకపోతే అందుకు కారణాలను తెలుపుతూ అర్జీదారులకు ఇవ్వాలన్నారు. కొన్ని శాఖల్లో అర్జీలు పెండింగ్ అధికంగా ఉన్నాయని, అటువంటి వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ కే శ్రీనివాసులు, డీఆర్వో ఆర్. శ్రీలతతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

● కౌలుకు భూమి ఇస్తే ఆ భూమి తమదంటూ అనేక ఇబ్బందులు పెడుతున్నారని మర్రిపూడి మండలం నిర్మాపురంకు చెందిన మాలెపాటి నాగేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. కులవృత్తే జీవనాధారంగా జీవిస్తూ గుంటూరులో నివాసం ఉంటున్నామని తెలిపారు. పూర్వీకుల నుంచి సంక్రమించి ఉన్న 52/1లో 3.48 ఎకరాలు, 52/2లో 7.74 ఎకరాలు, 52/4 సర్వేనెంబరులో 0.32 సెంట్లు కలిపి 10.54 ఎకరాలు ఉందన్నారు. ఆ భూమిని నిర్మాపురంలోని కొంత మంది రైతులకు కౌలుకు ఇచ్చామన్నారు. తన భర్త అనారోగ్యంతో చనిపోవడంతో ఇప్పుడు కౌలు ఇవ్వకుండా తమకు రిజస్ట్రేషన్లు చేసి ఇచ్చారని ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని విన్నవించారు.



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## ఎస్పీ స్పందనకు 88 ఫిర్యాదులు

ఒంగోలు (క్రైం)జనవరి22: ఎస్పీ స్పందనలో 88 మంది తమ సమస్యలపై ఫిర్యాదులను అందజేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ కె.నారాయణస్వామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్‌శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## నిధులు గోల్‌మాల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(రూరల్) జనవరి 22: నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామపంచాయతీలో నిధులు గోల్‌మాల్ చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, వారి నుంచి నగదు రికవరీ చేయాలని కోరుతూ స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఉప్పుగుండూరు గ్రామస్థులు, వార్డు సభ్యులు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీలో కార్యదర్శి, గుమస్తా దాదాపు కోటిరూపాయలకు పైగా నిధులు దింగమింగారని, వారిని జిల్లా అధికారులు సస్పెండ్ చేశారుకానీ వారి నుంచి నేటి వరకు రికవరీ చేయలేదని అందులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ రెండురోజులలో ఈ అక్రమాలపై నివేదిక ఇవ్వాలని డీఎల్‌పీవోను ఆదేశించారు . ఈ కార్యక్రమాలలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కనగాల శ్రీనివాసరావు,సురేంద్ర జాలాది, బెల్లం రంజిత్, గ్రామనాయకులు తెలగతోటి జాన్సన్, తిరుమల శెట్టి శ్రీను, పొట్లూరి నాగమల్లేశ్వరరావు, కె .సెల్వం, జంజనం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



సమరసత మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

# అంతా రామమయం!

● బాలరాముని ప్రతిష్ఠతో పులకించిన భక్తజనం
● వాడవాడలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు
● ఇళ్లలో దీపాలు వెలిగించి, అక్షతలు ధరించిన ప్రజలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 22: అయోధ్య శ్రీరామ మందిరంలో బాలరాముని ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఒంగోలు నగరంలో ఆధ్యాత్మికత నెలకొంది. రామలల్లా ప్రతిష్ఠకు ముందు ఆదివారం నుంచే ఆధ్యాత్మిక కార్యక్రమాలు నగరంలో ప్రారంభం అయ్యాయి. ఇక విగ్రహప్రతిష్ఠ జరిగిన సోమవారం స్థానిక గాంధీరోడ్డు శ్రీ అనంత కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణం వద్ద, సంతపేట శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామ కల్యాణోత్సవాన్ని నిర్వహించగా, పెద్యాల వారి సత్రం, రాజీవ్‌నగర్ బ్రాహ్మణ వృద్ధాశ్రమం, గుర్రం వారి వీధి కోదండ రామాలయం, గద్దలగుంట రామాలయం, భగీరథ సెంటర్, లాయర్‌పేట చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, రాజాపానగల్ రోడ్డు శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం, ఐశ్వర్యనగర్ శ్రీ సీతారామచంద్ర దేవస్థానం తదితర చోట్ల భక్తులు శ్రీరామనామ సంకీర్తన, ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు కాషాయ వస్త్రాలు ధరించి గాంధీరోడ్డు వరకు పాదయాత్రను నిర్వహించారు.


ఇళ్లలో ప్రత్యేక అలంకరణతో దీపారాధన

అలాగే పలు విద్యాసంస్థలలోను శ్రీరామ ప్రతిష్ఠ వేడుకను ఘనంగా నిర్వహించారు. చందమామ శ్రీవాణి స్కూల్, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సీతారాములు, ఆంజనేయుని వేషధారణతో కాషాయ జండాలు పట్టుకుని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ పలు ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు.

### మద్దిపాడులో సీతారామ కల్యాణం

మద్దిపాడు, జనవరి 22: అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మద్దిపాడులో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. జొన్నవట్ల శ్రీనివాసరావు దంపతులు కల్యాణక్రతును, ఆగమ పండితుల నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

### మారుమోగిన జై శ్రీరామ్ నామస్మరణ

నాగులుప్పలపాడు (ఒంగోలు రూరల్)జనవరి 22: అయోధ్యలో సోమవారం బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నాగులుప్పలపాడు గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరామ్ నామస్మరణతో గ్రామం మారుమోగింది. ప్రతి ఇంటికీ స్వామివారి తలంబ్రాలను పంపిణీ చేశారు. ఈ ఊరేగింపు ఆర్యవైశ్యుల రామ మందిరం నుంచి ప్రారంభమై తిరిగి అక్కడకు చేరుకున్నది .ఈ సందర్భంగా 2వేల మందికి అన్నదానం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటి నుంచి భక్తులు పాల్గొనటం విశేషం.


నాగులుప్పలపాడు గ్రామంలో జైశ్రీరామ్ నినాదాలతో మహిళా భక్తుల ఊరేగింపు

# పారదర్శకంగా ఓటర్ల జాబితాలు

**- కలెక్టర్ దినేష్‌కుమార్**

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : జిల్లాలో ఓటర్ల జాబితాలను పారదర్శకంగా ప్రచురించామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్‌ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది అక్టోబరులో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన నాటి నుంచి తుది ఓటర్ల జాబితా ప్రచురించేంత వరకు నిర్వహించిన కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. ప్రతి వారం పార్టీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు అభ్యంతరాలు, సూచనలు, సలహాలను కూడా తీసుకున్నామన్నారు. ఆయా అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఓటర్ల జాబితాను పారదర్శకంగా ప్రచురించామని వివరించారు. అనంతరం గుర్తింపు పొందిన ఏడు రాజకీయపార్టీలకు ఓటర్ల జాబితాల సీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీనివాసులు, డీఆర్వో ఆర్. శ్రీలత, ఆర్డీవో విశ్వేశ్వరరావుతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్ క్రాంతికుమార్, స్వరూల్, గుర్రం సత్యం, రసూల్, రఘురాం తదితరులు ఉన్నారు.

# సంతనూతలపాడు నియోజకవర్గ ఓటర్ల జాబితా విడుదల

● 256 పోలింగ్ కేంద్రాలు, 2,12,357 మంది ఓటర్లు

చీమకుర్తి,జనవరి 22: సంతనూతలపాడు నియోజకవర్గంలో ఓటర్ల తుదిజాబితాను సోమవారం నాలుగుమండలాల పరిధిలో ఉన్న 256 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్. వరకుమార్ ఓటర్ల వివరాలను తెలిపారు. పురుష ఓటర్ల మీద మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని,నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చీమకుర్తిలో ఓటర్ల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఇంకా ఎవరైనా 18సంవత్సరాల వయస్సు నిండి ఓటరుగా నమోదుకాకపోతే ఫారం6 పూర్తిచేసి బీఎల్‌వోలకు అందించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.ఎన్నికల సమాచారం కోసం 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేసి తగు సమాచారం పొందవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో తహసీల్దార్ పిన్నిక మధుసూదన రావు, డీటీలు సాయి, శ్రీనివాస రావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.మండలాల వారీగా తుదిజాబితాలో ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.


వివరాలు తెలియచేస్తున్న ఈఆర్‌వో వరకుమార్

| మండలం | పురుషులు | స్త్రీలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| చీమకుర్తి | 30274 | 30486 | 1 | 60761 |
| సంతనూతలపాడు | 26911 | 28058 | 3 | 54972 |
| మద్దిపాడు | 20007 | 20913 | 0 | 40920 |
| నాగులుప్పలపాడు | 27216 | 28487 | 1 | 55704 |
| మొత్తం | 104408 | 107944 | 5 | 212357 |

# కోడికత్తి కుట్ర బయటకు వస్తుందనే కోర్టుకు రాని జగన్

**దళిత నేతల ఆరోపణ**


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : కోడి కత్తి కుట్ర వెనుక ఉన్నది వైసీపీ నేతలనే నిజం బయటకు వస్తుందన్న భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విచారణ జరగకుండా స్టే తెచ్చుకుంటున్నారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. కోడి కత్తి కేసులో జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ధారా అంజయ్య ఆధ్వర్యంలో నిరసన దీక్ష జరిగింది. ఈ దీక్షలో పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ జగన్ పాలనలో దళితులకు దీక్ష చేసే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. కోడికత్తి శ్రీను కేసులో జగన్ కోర్టుకు రావాలని దీక్ష చేసిన శ్రీను తల్లి పార్వతమ్మ, సోదరుడు సుబ్బరాజులను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. శ్రీను చేయని నేరాన్ని ప్రాసిక్యూషన్ చేసినట్లు నిరూపించినా రెండు సంవత్సరాలకంటే ఎక్కువశిక్ష పడదని చెప్తున్నా ఇంత వరకు బెయిల్ రాక జైలులోనే మగ్గుతున్నాడని ఆరోపించారు. ఈకార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, జంద్రాజుపల్లి ఆంజనేయులు, గంటా సుబ్బారావు, షేక్ ఖాసీం వలి, మేకల ఆదినారాయణ, టీడీపీ నాయకుడు తెలగతోటి జాన్సన్ తదితరులు ఉన్నారు.

## ఎస్పీని కలిసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి

ఒంగోలు (క్రైం)జనవరి22: ఎస్పీ మలికగర్గ్‌ను ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగర్జున సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రి నాగార్జున నూతనంగా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. దీంతో నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎస్పీకి దృష్టికి తీసుకెళ్ళినట్టు తెలిసింది. అదే సమయంలో ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ అయిన తరువాత కొన్ని కారణాల వలన అక్కడ నియమించిన సీఐ రాజమోహన్ చేరలేదు. ఆ విషయంపై కూడా ఎస్పీతో చర్చించినట్లు సమాచారం.

# నేటి నుంచి విద్యార్థులకు ఎఫ్ఎ-3 పరీక్షలు

ఒంగోలు(విద్య), జనవరి 22 : జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఎఫ్ఎ-3పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 1నుంచి ఐదు తరగతలకు 23న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 25న ఉదయం పరిసరాల విజ్ఞానం, మధ్యాహ్నం ఇంగ్లీషు పరీక్ష జరుగుతుంది. 6 నుంచి 8 తరగతులకు 23న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 25న ఉదయం హిందీ, మధ్యాహ్నం జనరల్ సైన్స్, 27న ఉదయం సోషల్, 29న మధ్యాహ్నం ఇంగ్లీషు జరుగుతుందన్నారు. 9.10 తరగతులకు 23న ఉదయం తెలుగు, గణితం, 25న హిందీ, జనరల్ సైన్స్, 27న ఉదయం సోషల్ స్టడీస్, 29న ఇంగ్లీషు పరీక్ష జరుగుతుందని డీఈవో తెలిపారు.

## జిల్లా నుంచి 20 మంది ఎస్సైలు బదిలీ

ఒంగోలు (క్రైం)జనవరి22: జిల్లాలో ఇప్పటి వరకు వివిధ హోదాలలో పనిచేసి ప్రమోషన్‌పై ఎస్సైలుగా పనిచేస్తున్న 20 మందిని వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. అదేవిధంగా ఆయా జిల్లాల నుంచి 21 మందిని జిల్లాకు కేటాయించారు. ఎన్నికల నిబంధన ప్రకారం స్వంత జిల్లాలో పనిచేయకూడదు అనే నిబంధనతో ఈ బదిలీలు చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశాలు ఇచ్చారు. జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు బదిలీ అయిన వారు కె.శ్రీనివాసరావు, ఎస్.డీ.మీరాసాహేబ్, ఎస్.కె.అమీర్, యు.సుబ్బారావు, ఎస్.కె.గౌస్ బాషా, జి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్ ఉన్నారు. అలాగే గుంటూరు జిల్లాకు ఏవీ సుబ్బారావు,ఎం.వెకటేశ్వర్లు, సీహెచ్ ఆరోహన్, ఏ.శ్రీనివాసమూర్తి, ఎం.వేణుగోపాల్, బి.బాబురావు ఉన్నారు. అలాగే పల్నాడు జిల్లాకు పి.ఇమ్మానియేల్, ఎస్.కె.నజీర్ సాహెబ్, జి.శ్రీనివాసులు, వి.వెంకటేశ్వర్లు, కె.కోటయ్య, జే.శ్రీను, హెచ్.చెంచయ్యలు ఉన్నారు.

# అవీ..ఇవీ..

## సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పశుసంవర్ధక సహాయకుల పోస్టుల నియామకం కోసం సోమవారం పశుసంవర్ధకశాఖలో అభ్యర్థుల సర్టిఫికేట్ల పరిశీలన నిర్వహించినట్లు ఆశాఖ అధికారి డాక్టర్ కే బేబిరాణి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 177 సహాయకుల పోస్టులకు 2,500 మంది ఎంపిక పరీక్షకు హాజరు కాగా వారిలో మెరిట్, రోస్టర్ ప్రకారం 109 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. వారిలో 37 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్నికు మూడు బృందాలు నిర్వహించినట్లు తెలిపారు. మిగిలిన 72 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలిస్తారని తెలిపారు. ఈనెల 25న కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో జరిగే జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో నియామక పత్రాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బేబిరాణి తెలిపారు.


సర్టిఫికెట్ల పరిశీలనకు సిబ్బందికి సూచనలు ఇస్తున్న బేబిరాణి

## 26 నుంచి రెవెన్యూ అధికారుల ఫోన్ నెంబర్లు మార్పు

**- ఓడా సిమ్ నుంచి జియోకు మార్పు**

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : జిల్లాలో రెవెన్యూశాఖలో పనిచేస్తున్న కలెక్టర్ నుంచి ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ ప్రాజెక్టుల్లో పనిచేసే ఎస్‌డీసీల నుంచి తహసీల్దార్ కార్యాలయాల వరకు పనిచేసే రెవెన్యూ ఉద్యోగుల ఫోన్ నెంబర్లు ఈనెల 26 నుంచి మారనున్నాయి. ఇప్పటి వరకు ఆ శాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఓడా సిమ్‌ను వినియోగిస్తుండగా ఈనెల 26నుంచి జియో సిమ్‌ను వినియోగించనున్నారు. 9281034400 నెంబర్‌ను కలెక్టర్ పీఎస్‌కు కేటాయించగా మధ్యలో మూడు నెంబర్లను కలెక్టర్, జేసీ, డీఆర్వోకు కేటాయించారు. 9281034404 నుంచి 92811034492 వరకు ఆర్డీవోలు, స్పెషల్ కలెక్టర్లు, తహసీల్దార్లు, సెక్షన్ల సూపరింటెండెంట్లు, వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులకు కేటాయించారు.

## 25న చీమకుర్తిలో జయహో బీసీ సభ


మాట్లాడుతున్న అడకా స్వాములు

చీమకుర్తి, జనవరి 22 : అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈనెల 25న చీమకుర్తి పట్టణంలో నిర్వహించనున్న జయహో బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు కోరారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వహయాంలో స్థానికసంస్థల్లో బీసీ రిజర్వేషన్ తగ్గించారని, నిధులు మంజూరు లేదని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, అవనిగడ్డ శేషారావు, కొత్రపు రాఘవరావు, కంకణం పాటి బుజ్జిబాబు,నర్రా నాగరాజు, కాటేపల్లి యలమంద, రామారావు,భువనగిరి వెంకాయమ్మ, బ్రహ్మాజీ, సరికొండ చిరంజీవి రాజు,నరసింహారావు, వెంకట్రావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల అక్రమ అరెస్టును నిరసిస్తూ ర్యాలీ

చీమకుర్తి, జనవరి 22 : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలను వారికి మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాల నాయకులను ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్‌నగర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ నిర్వహించిన ఈ ర్యాలీలో పలు ప్రజాసంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

## 18 మంది పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

మద్దిపాడు, జనవరి 22: విజయవాడలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలను వెళ్లనీయకుండా మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్ 18 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా మండల అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు జయప్రద మాట్లాడుతూ ప్రభుత్వం అరెస్టులతో అంగన్‌వాడీ కార్యకర్తలను అణచివేయాలని చూస్తున్నదని అన్నారు.పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. నాతాని ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను తొలగిస్తామని ప్రభుత్వంబెదిరింపులకు పాల్పడుతున్నదని, తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఉబ్బా ఆదిలక్ష్మి, కోమలి, మేరి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## రేపు రాష్ట్ర బంద్

● పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22: అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ కార్మిక సంఘాలు బుధవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. 35 రోజుల నుంచి సమస్యలపరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. దీంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి దూర ప్రాంతాలకు తరలించడంతో కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. ప్రభుత్వవైఖరిని నిరసిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఏఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాలు అంగన్‌వాడీలకు మద్దతుగా బంద్‌కు పిలుపునిచ్చారు.

## ఇద్దరికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22 : దివ్యాంగుల కోటాలో 2020-21 సంవత్సరానికి సంబంధించి బ్యాక్ లాగ్ పోస్టుల్లో అర్హులైన ఇద్దరు అభ్యర్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం రాత్రి ఈ నియామక ఉత్తర్వులు అందజేశారు. వారిలో ఒకరు బధిరులు కాగా మరొకరు అంధులు. వీరిద్దరిని జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

# వైఎస్సార్ కేపీ ఉద్యోగుల సమ్మె

**సెర్ప్ సీఈవోతో జరిగిన చర్చలు విఫలం**

ఒంగోలు నగరం, జనవరి 22: రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ ద్వారా నడుస్తున్న వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి అందులో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించటం, వారికి పేస్కేలు అమలు చేయాలని కోరుతూ సమ్మెకు దిగుతున్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 42వ రోజుకు చేరింది. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రభుత్వ వైఖరి ఈ స్థాయిలో నిరంకుశంగా ఉన్నప్పటికీ సెర్ప్ ఉద్యోగులు సమ్మెకు పిలుపునివ్వటం గమనార్హం. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మెను వి రమించేది లేదంటూ సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, లేని పక్షంలో ఈ నెల 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు వైఎస్సార్ కేపీ ఉద్యోగులు ఈ నెల 11వ తేదీనే ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లను కలిసి వినతులు సమర్పించారు. ఈలోగా తమ డిమాండ్లను పరిష్కరించకపోతే 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు స్పష్టం చేశారు. కాగా సోమవారం రాత్రి సెర్ప్ సీఈవో ఇంతియాజ్, రాష్ట్ర సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులతో చర్చలు జరిపారు. చర్చలు విఫలం కావటంతో నాయకులు సమ్మెకు వెళుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల అమల్లో ప్రధాన భూమిక సెర్ప్ ఉద్యోగులే పోషిస్తున్నారు. నవరత్నాల్లో అమలు చేస్తున్న జగనన్న చేదోడు, జగనన్న పాలవెల్లువ, సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ ఆసరా పించన్లు, స్త్రీనిధి రుణాలు, ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి రుణాలు, తదితర సంక్షేమ పథకాలు దాదాపు అన్ని సెర్ప్ ద్వారానే అమలు జరుగుతున్నాయి.సెర్ప్ ఉద్యోగుల సమ్మెతో మంగళవారం నుంచి పథకాల అమలు నిలిచిపోనుంది.

# అంగన్‌వాడీలపై నిర్బంధం


సింగరాయకొండ పోలీసుస్టేషన్‌లో ఉన్న టంగుటూరు మండల అంగన్‌వాడీలు


సింగరాయకొండలో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీరామ్

**ఎక్కడికక్కడ పోలీసుల తనిఖీలు**

**చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డగింత**

**అదుపులోకి పలువురు నేతలు**

టంగుటూరు, జనవరి 22 : అంగన్‌వాడీలు తలపెట్టిన చలో విజయవాడను భగ్నం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధం విధించారు. కార్యకర్తలు, ఆయాలు కార్యక్రమానికి వెళ్లకుండా నిలువరించేందుకు ఆదివారం రాత్రి నుంచే నిఘా పెట్టారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, టంగుటూరు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. టంగుటూరులోని తన నివాసంలో ఉన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, పొందూరులో నివాసం ఉండే కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్‌లను సోమవారం ఉదయం అదుపులోకి తీసుకొని టంగుటూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారిని మధ్యాహ్నం వరకూ స్టేషన్‌లోనే ఉంచారు. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో తాడేపల్లి వెళ్లేందుకు సింగరాయకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న 11 మంది అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో టంగుటూరు మండలానికి చెందిన కార్యకర్తలు ఆరుగురు ఉన్నారు. వీరందరినీ సింగరాయకొండ పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం వరకు నిర్బంధించారు. తొలుత తాడేపల్లి వెళ్లేందుకు అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు సిద్ధం కాగా పోలీసుల కట్టడితో ఆగిపోయారు. అయితే ఒక రోజు ముందుగానే అంగన్‌వాడీ యూనియన్ ముఖ్యనాయకులు కొందరు తాడేపల్లి చేరుకున్నట్లు సమాచారం.

**సీఐటీయూ నాయకుల అరెస్ట్**

కొండపి : అంగన్‌వాడీలు తలపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం సాయంత్రమే వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకుడు కేజీ మస్తాన్, సీఐటీయూ మండల కార్యదర్శి జి.వందనంలను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం వరకు వారిని కొండపి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. అంగన్‌వాడీలు విజయవాడకు వెళ్లకుండా నోటీసులు ఇచ్చారు. ఎక్కడికక్కడ పోలీసులు నిలువరించడంతో కార్యకర్తలు, ఆయాలు స్థానిక మండల కార్యాలయం వద్ద శిబిరంలోనే నిరసన కొనసాగించారు. సీఎం జగన్, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


కొండపి పోలీసు స్టేషన్‌లో ఉన్న సీఐటీయూ నాయకులు

**సూపర్‌వైజర్లకు పిలుపు**

ప్రభుత్వం ఒకవైపు నిర్బంధాన్ని కొనసాగిస్తూనే మరోవైపు కార్యకర్తలు, ఆయాల తొలగింపునకు ఉపక్రమించింది. కొండపి ప్రాజెక్టులోని సీడీపీవో, కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాలకు చెందిన సూపర్‌వైజర్ల ను, సీడీపీవో కార్యాలయ సిబ్బందిని వెంటనే ఒంగోలు పీడీ కార్యాలయానికి రావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో అందరూ హుటాహుటిన అక్కడికి వెళ్లారు. ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ అయిన సోమవారం ఉద యం 10 గంటల్లోపు ప్రాజెక్టు పరిధిలో ఒక్కరు కూడా విధులకు హాజరుకాలేదు. దీంతో వీరందరినీ మూకుమ్మడిగా తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

**17 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

సింగరాయకొండ : విజయవాడ వెళ్లేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌లో ఉన్న 17 మంది అంగన్‌వాడీలను సోమవారం తెల్లవారుజామున ఎస్సై టి.శ్రీరామ్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకూ అక్కడే ఉంచి అనంతరం విడిచిపెట్టారు.

# ఎస్సీల సంక్షేమాన్ని విస్మరించిన జగన్

**పాకలలో ఎమ్మెల్యే స్వామి విమర్శ**


పాకల ఎస్సీకాలనీలో ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాకొండ, జనవరి 22 : ఎస్సీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన సీఎం జగన్‌రెడ్డి వారిని పాతాళానికి తొక్కేశారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి విమర్శించారు. మండలంలోని పాకల ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి నిర్వహించిన బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్లు ఇచ్చి భరోసా కల్పించామన్నారు. లిడ్‌క్యాప్, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి ఇతోధికంగా టీడీపీ పాటుపడిందని తెలిపారు. అలాగే జీవో నెంబరు 25ని అమలు చేసి ఎస్సీలకు [illegible] విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీలకు అందే 27 రకాల పథకాలను రద్దు చేసిందని దుయ్యబట్టారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, కోకొల్లలు జరిగాయని స్వామి ఆవేదన వ్యక్తంచేశారు. దళితుల సంక్షేమానికి ఆది నుంచి కృషి చేస్తున్నది టీడీపీయేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీలోని అన్ని మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా మార్చామని గుర్తు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీచౌదరి, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, గుడే వెంకటేశ్వర్లు, రేనుమాల పోతురాజు, కన్నా ప్రసాద్, కల్లగుంట నరసింహ, జమ్ము శంకర్ పాల్గొన్నారు.

**15 కుటుంబాలు టీడీపీలో చేరిక**

పాకల పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన 15 కుటుంబాల వారు ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర పూర్వ వైభవం కోసం ప్రతిఒక్కరూ చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో పసుమర్తి శ్యాంబాబు, సువర్ణబాబు, రేణుమాల జీవన్, కోటయ్య, కొండేటి గిరి, గౌడపేరు కోటేశ్వరరావు, ఎండ్లూరు యశ్వంత్, తగరపు వంశీ, జయసువాస్, రేణుమాల బ్రహ్మయ్యతోపాటు వారి కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు.


టంగుటూరులో హోమం చేస్తున్న భక్తులు

## కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనామ జపం

టంగుటూరు, జనవరి 22 : టంగుటూరులోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం శ్రీరామనామ జపం జరిగింది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవస్థానం వారు, ఆర్యవైశ్యసంఘం సంయుక్తంగా ఈ క్రతువును నిర్వహించారు. కోదండ రామస్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మూడు హోమశాలలు ఏర్పాటు చేసి సుమారు 40మందికి పైగా భక్తులు హోమాలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది. ఆలయ ప్రాంగణమంతా శ్రీరామనామస్మరణతో మారుమోగింది.


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

## వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర

సింగరాయకొండ : అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పంచాయతీ పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలోని రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి పాకల రోడ్డు వరకు వైభవంగా శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. అంజనేయ కాలనీలోని ప్రసన్నాంజనేయ దేవస్థానంలో ప్రత్యేక హోమాలు చేశారు. ఊళ్లపాలెం గ్రామంలో మత్స్యకార గ్రామాల నుంచి ఆంజనేయస్వామి విగ్రహం వరకు శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామనామస్మరణ మారుమోగింది.

## రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి

టంగుటూరు, జనవరి 22 : రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో టంగుటూరు సమీపంలోని పాలేరు రైల్వే బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. మృతుడు నలుపురంగు జీన్స్ ప్యాంటు, నలుపురంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సెల్‌ఫోన్ నెంబర్‌లు : 94409 04870, 94406 27646కు సమాచారం ఇవ్వాలని ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు కోరారు.

## లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

మార్టూరు, జనవరి 22 : రోడ్డు దాటుతున్న అట్లూరి కోటేశ్వరమ్మ(64) అనే వృద్ధురాలిని లారీ ఢీకొనడంతో మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై అంబేడ్కర్ నగర్ ఎదురుగా చోటు చేసుకుంది. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మృతురాలు కోటేశ్వరమ్మ, మరో ముగ్గురు మహిళలతో కలిసి యద్దనపూడి గ్రామంలోని చర్చికి ప్రార్థనకు వెళ్లడానికి రోడ్డు దాటుతున్నారు. అదేసమయంలో గుంటూరు వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ముగ్గురు మహిళలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, జనవరి 22: రోడ్డు ప్రమాదంలో యవకుడు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం పంగులూరు సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కొండమంజులూరుకు చెందిన చొప్పవరపు మోజెస్ (27) పంగులూరులో బంధువుల ఇంట జరిగిన ఓకార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. పంగులూరు సమీపంలో చప్టావద్ద వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మోజెస్ అద్దంకిలోని పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య రాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రేణంగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోడి పందెం స్థావరంపై దాడి

పీసీపల్లి, జనవరి 22 : కోడి పందెం వేస్తున్న ముగ్గురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు మండలంలోని చినవరిమడుగు సమీపంలోని పొలాల్లో కోడిపందేలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో స్థావరంపై దాడిచేసి ముగ్గురి ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కోడి పుంజులు, రూ.3500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు


మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

దర్శి, జనవరి 22 : వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువైందని అధికార పార్టీ నాయకులు వారిపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం జయహో బీసీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘ నత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. బీసీల ఆత్మబంధువు చంద్రబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ. జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నీలిశెట్టి నారాయణ పాల్గొన్నారు.

## రేంజ్‌లో మరికొందరు సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 22 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రేంజిలో సీఐల బదిలీల పరంపర కొనసాగుతోంది. దీనిలోభాగంగా సోమవారం మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సీఐ బి.పాపారావును తిరుపతి జిల్లా గూడూరు 1వటౌన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీవుల్లాను ప్రకాశం జిల్లా దర్శి సీఐగా నియమించారు. దర్శి సీఐ జె.రామకోటయ్యను గుంటూరు రేంజి వీఆర్‌కి బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ కే.అజయ్‌కుమార్‌ను నెల్లూరు జిల్లా దిశ 2 సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న టి.విజయ్‌కృష్ణను ప్రకాశం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ప్రకాశం సీసీఎస్‌లో ఉన్న పి.బాలాజీని గుంటూరులోని రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

# కొండపి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం

**మొత్తం ఓట్లు 2,35,866**

**స్త్రీలు 1,19,117, పురుషులు 1,16,747**

**ఇద్దరు ట్రాన్స్‌జెండర్‌లు**


మాట్లాడుతున్న ఈఆర్వో నారదముని

కొండపి, జనవరి 22 : కొండపి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 2,35,866 మంది ఓట్లు ఉండగా అందులో స్త్రీలు 1,19,117, పురుషులు 1,16,747 మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్‌లు. సోమవారం ఓటర్ల తుది జాబితాను ప్రచురించారు. వివరాలను నియోజకవర్గ ఈఆర్వో నారదముని వెల్లడించారు. ఆ ప్రకారం మర్రిపూడి మండలంలో పురుష ఓటర్లు 17,270 మంది, మహిళా ఓటర్లు 16,427 మంది మొత్తం 33,697 మంది ఉన్నారు. పొన్నలూరు మండలంలో మొత్తం 33,352 మంది ఓట్లు ఉండగా అందులో పురుషులు 16,660, మహిళలు 16,692 మంది ఉన్నారు. జరుగుమల్లి మండలంలో మొత్తం 32,961 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు 16,278 కాగా, మహిళలు 16,682 మంది, ఒకరు ట్రాన్స్‌జెండర్. కొండపి మండలంలో మొత్తం 34,554 ఓట్లు ఉండగా అందులో పురుషులు 17,135, మహిళలు 17,418 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. టంగుటూరు మండలంలోని మొత్తం 49,055 మంది ఓటర్లలో పురుషులు 23,820 మంది, మహిళలు 25,235 మంది ఉన్నారు. సింగరాయకొండ మండలంలో 52,247 మంది ఓటర్లకుగాను పురుషులు 25,584, మహిళలు 26,663 మంది. సోమవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఆర్వో నారదముని మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు లేకుండా నిస్పక్షపాతంగా ఎన్యూమరేషన్ జరిగిందన్నారు. అందుకు ప్రజలు, పార్టీల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చేర్పులు, తొలగింపుల కార్యక్రమం ఇంతటితో ఆగిపోలేదని, అర్హులు ఉంటే ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో కొండపి, జరగుగుమల్లి తహసీల్దార్లు పి.శింగారావు, ఉషారాణి, ఎన్నికల సిబ్బంది హనుమంతరావు, తన్నీరు వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకుడు గొట్టిపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

# చీరాల, అద్దంకిలో వేడెక్కిన రాజకీయం

**చీరాలలో వైసీపీ అభ్యర్థిగా వెంకటేష్ పేరు ఖరారు**

**తాడేపల్లిలో ఆమంచి అత్యవసర మంతనాలు**

**అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలంలో**

**ఖాళీ అవుతున్న వైసీపీ**

**టీడీపీలోకి ఎంపీటీసీ సభ్యులు, 12 మంది సర్పంచ్‌లు**


రవికుమార్‌తో వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. చీరాలలో అధికార వైసీపీ సాధికారత బస్ యాత్ర నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే, పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తాడేపల్లి వెళ్లి రాష్ట్ర నేతలతో మంతనాలు నిర్వహించడం గమనార్హం. బస్ యాత్రలో పాల్గొన్న రాష్ట్ర నేతలు చీరాల వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కరణం వెంకటేష్‌ను గెలిపించాలని కోరగా, తాడేపల్లి వెళ్లిన ఆమంచి చీరాల బీసీ అభ్యర్థికి ఇవ్వాలని పట్టుబట్టడం గమనార్హం. మరోవైపు అద్దంకి నియోజకవర్గంలో వైసీపీకి చెందిన కొందరు నేతలు, పలువురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీంతో రెండు నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది. చీరాల ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్ ప్రస్తుత వైసీపీ ఇన్‌చార్జిగా ఉండగా అతని కోసం ఆపిన బస్ యాత్రను సోమవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మోకాలిదెబ్బతో వైద్యశాలలో ఉన్న వెంకటేష్ కోసం బస్ యాత్రను ఆపి ఆయన వచ్చాక సోమవారం నిర్వహించారు. బస్‌యాత్రలో పోటీ చేసే అభ్యర్థులపై వైసీపీ అధిష్ఠానం స్పష్టత ఇస్తున్న విషయం విదితమే. తదనుగుణంగా సోమవారం బస్ యాత్రలో వెంకటేష్ పేరును అధిష్ఠానం ప్రకటిస్తున్న విషయం ముందుగానే వెల్లడైంది. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న చీరాల మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి హడావుడిగా సోమవారం మధ్యాహ్నం తాడేపల్లి చేరారు. అక్కడ ఆయన ఆ పార్టీ ముఖ్య నేతలు సజ్జల, విజయసాయిరెడ్డితోపాటు సీఎంవో ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డిని కూడా కలిసినట్లు తెలిసింది. చీరాల అభ్యర్థిగా కరణం వెంకటేష్ పేరును ప్రకటించొద్దని డిమాండ్‌ను ఆయన వారి ముందు ఉంచినట్లు సమాచారం. తనకు చీరాలలో బీసీ అభ్యర్థికి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యే బలరాం ఆయన కుమారుడికి అద్దంకిలో అవకాశం ఇస్తామని చెప్పాకే తాను పర్చూరు పార్టీ బాధ్యతలు చేపట్టానని ఆమంచి వారితో అన్నట్లు తెలిసింది. అందువల్ల బస్‌యాత్ర సభలో చీరాల వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్‌ను అభ్యర్థిగా ప్రకటించవద్దని కోరినట్లు సమాచారం. రాత్రి పొద్దుపోయే వరకు ఆయన సీఎంవో వద్దే వారితో మంతనాలు జరుపుతున్నారు. అదే సమయంలో చీరాలలో జరిగిన బస్‌యాత్ర సభలో పాల్గొన్న నేతలు చీరాల నుంచి కరణం వెంకటేష్ పోటీ చేస్తారని, ఆయన్ను గెలిపించాలని స్పష్టమైన ప్రకటన చేశారు. మంత్రి మేరుగ నాగార్జునతోపాటు ఎంపీ మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్‌లు వారి ప్రసంగాల్లో చీరాలలో వెంకటేష్‌ను గెలిపించాలని రాష్ట్రంలో మళ్లీ జగన్ సీఎం కావాలని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పార్టీ అధిష్ఠానం ఇక్కడ విస్పష్ట ప్రకటన చేయడం గమనార్హం. కాగా అద్దంకి నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. సంతమాగులూరు మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డితోపాటు ఆ పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు, 12మంది సర్పంచ్‌లు టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు వారంతా సోమవారం రాత్రి జొన్నతాళి వద్ద అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే రవికుమార్‌తో మంతనాలు జరిపారు. త్వరలో వారందరూ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నట్లు సమాచారం. వైసీపీ నేతలు తమకు పట్టు ఉందని భావిస్తున్న సంతమాగులూరు మండలం నుంచి టీడీపీలోకి వలసలు ప్రారంభం కావడంతో ఆ నియోజకవర్గంలోనూ రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన లింగారెడ్డిపల్లి వాసులు


వైసీపీని వీడి టీడీలో చేరినవారితో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 22 : అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు 25 కుటుంబాలు టీడీపీ నాయకులు కమతం వెంకటేశ్వర్లు, అమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. వారికి ఉగ్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానన్నారు. ఐదు పనుల లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలయ్యే పథకాలు, వాటితో కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని కొత్తగా చేరిన వారికి తెలిపారు. ఏ ఇంటినీ వదలకుండా తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను, జగన్‌రెడ్డి అరాచక పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉగ్ర దిశానిర్దేశం చేశారు. పార్టీలోకి చేరేందుకు ఆశక్తిగా ఉన్న యువతను స్వాగతించాలన్నారు. పార్టీలో చేరిన అందరికీ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరూ ఐక్యతతో తన గెలుపునకు కష్టపడి పనిచేయాలని ఉగ్ర కోరారు.

## కులగణనను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్


వివరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

జమ్ములపాలెం (టంగుటూరు), జనవరి 22 : మండలంలో కులగణన జోరుగా సాగుతోంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అన్ని గ్రామాల్లో ఏకకాలంలో కొనసాగిస్తున్నారు. సోమవారం టంగుటూరు చేరుకున్న డిప్యూటీ కలెక్టర్ నారదముని మండలంలోని జమ్ములపాలెంలో జరుగుతున్న కులగణనను పరిశీలించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రత్నజ్యోతి, పంచాయతీ కార్యదర్శి అరుణ ఉన్నారు.

## వైద్యశాఖ ఉద్యోగుల్లో అలజడి

**నేడు కలెక్టర్‌కు చేరనున్న విచారణ నివేదిక**

**ఇప్పటికే అనేక అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు**

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 22: వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులలో అలజడి నెలకొంది. 2020లో భర్తీచేసిన ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై చేసిన విచారణ నివేదికను మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు కమిటీ ఇవ్వనున్నట్లు సమాచారం. 2020లో వైద్యశాఖలో నకిలీ సర్టిఫికెట్లతో పదులసంఖ్యలో ఉద్యోగాలు పొందారనే ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. జడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఓ వీఎస్ సుబ్బారావు నేతృత్వంలో కమిటీ విచారణను జరిపి సమగ్ర నివేదికను తయారుచేశారు. 50 రోజుల పాటు ఈ విచారణ జరిగింది. జడ్పీ, విద్యాశాఖకు చెందిన ఉద్యోగులు ఈ విచారణ సమయంలో నియామకాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించారు. నోటిఫికేషన్ జారీ నాటి నుంచి ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చేంతవరకు జరిగిన పరిణామాలను ఈ నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్(ఎల్‌టీ) పోస్టుల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. విచారణ నివేదిక ఇస్తే ఇందులోని లోపాలు అధికంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా విచారణ నివేదికను కలెక్టర్‌కు మంగళవారం అందజేయనున్నట్లు ప్రచారం రావడంతో ఆ సమయంలో పనిచేసిన ఉద్యోగులతోపాటు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఆ నియామకాలు జరిగి మూడేళ్లకుపైగా కాగా ఇప్పుడు అక్రమాలు బయటపడితే తమ పరిస్థితి ఏంటన్న భయం పలువురు ఉద్యోగుల్లో నెలకొంది.

# వైభవంగా సీతారాముల కల్యాణం

- పలు గ్రామాల్లో ర్యాలీలు
- బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారం
- ఆసక్తిగా తిలకించిన భక్తులు



మార్కాపురంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 22: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మార్కాపురంలోని ప్రసన్న రామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు సీతారాముల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించారు. కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణం తిలకించి పులకరించిపోయారు.

ఎర్రగొండపాలెం : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎర్రగొండపాలెంలో రామభక్తులు పలు సేవా, ప్రదర్శనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎర్రగొండపాలెం పట్టాభిరామస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణ మూలవిరాట్‌లకు, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదానం చేశారు. కొలుకుల కూడలిలో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాన్ని టీవీలో లైవ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి ప్రజలకు అన్నదానం చేశారు. స్టేట్‌బ్యాంక్ వీధి పెద్దలు ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం దీపాలు వెలిగించారు.

కొమరోలు : అయోధ్యలో సోమవారం బలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో విశేష పూజలను శివగురువు పొట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు ఇంటిపై కాషాయ జెండాను ఏగరవేసి 'జై శ్రీరాం' అని నినాదాలు చేశారు. కొమరోలులోని శ్రీపట్టాభిరామస్వామి దేవాలయంలో, ఆర్యమరాఠి కాలనీలోని శ్రీకోదండరామస్వామి దేవాయంలో సీతా, రాములవారికి, ఆంజనేస్వామి విగ్రహాలకు నూతన వస్త్రాలను సమర్పించి అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు వడపప్పు, పానకంలు, ప్రసాదాలను పంచిపెట్టారు. ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు టీవీలలో తిలకించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని అక్కపల్లి, బాదినేనిపల్లి గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకులు పాతకోట బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జై శ్రీరాం జెండాలను ప్రజలకు పంచిపెట్టారు. శ్రీ సీతారాముల గ్రామోత్సవాన్ని డప్పువాయిద్యాల మధ్య నిర్వహించారు.

పొదిలి : అయోధ్యలోని బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న వేళ మండలంలోని పలువురు భక్తులు తమ ఇళ్లలో రాములవారికి విశేష పూజలు చేశారు. పట్టణంలో ఇటీవల విశ్వనాధపురం జూనియర్ కళాశాల రోడ్డులోని రామాలయంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం నుండి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షతలతో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా అమ్మవారిశాలలో హోమాలు గ్రామోత్సవం నిర్వహించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టి అన్నదానం చేశారు.



కొమరోలులో రాములవారి గ్రామోత్సవం, గిద్దలూరులో అయోధ్య ప్రాణప్రతిష్ఠను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు, భక్తులు

పెద్ద దోర్నాల : మండలంలోని ప్రజలు అయోధ్య బాలరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమ గ్రామంలోనే కార్యక్రమం జరుగుతోందని భావించి పండుగలా చేసుకున్నారు. నియమ నిష్ఠలతో ఇంటిల్లి పాది వేకువ జాముననే స్నానం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో స్థానిక శ్రీ పట్టాభి సీతారామస్వామి దేవాలయం, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, తిమ్మాపురం, రామాలయంలో. ఐనముక్కల శ్రీ సీతారామస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో ఆలయ కమిటి పెద్దలు వెచ్చా హరగోపాల్, నాగెళ్ల సత్యనారాయణ, పీ.సీతారామయ్య, పీ.రామారావు, వెంకట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల్లో విశేష పూజలు చేశారు. మేడపి, త్రిపురాంతకం, కొత్తఅన్నసముద్రం, పాతఅన్నసముద్రం, సోమేపల్లి, చెర్లోపల్లితోపాటు పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

గిద్దలూరు : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ప్రజలు స్థానిక దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని అమ్మవారిశాల, సాయిబాబా దేవాలయం, రామాలయం, గ్రామాల్లోని రామాలయాలలో ప్రతిష్ఠ జరిగే సందర్భంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో దేవస్థాన ధర్మకర్త డాక్టర్ జేవీ.నారాయణ ఆధ్వర్యంలో టీవీ స్ర్కీన్‌పై ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు, బీజేపీ నాయకులు తిలకించారు.

మార్కాపురం వన్‌టౌన్ : అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మార్కాపురం పట్టణం శ్రీరామ నామ జపంతో మార్మోగింది. ఆలయాల వద్ద ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించే ఏర్పాటు చేశారు. పాండురంగ స్వామి ఆలయ కమిటీ వివేకానంద పాఠశాల హిందూచైతన్య వేదికల ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్రలు, బైక్‌ర్యాలీలు నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. నెహ్రూబజార్ షిరిడీ మందిరంలో శ్రీరాముని చిత్రపటానికి పూజలు చేశారు. సోమవారం తెల్లవారిజాము నుంచే రామనామస్మరణలతో మార్కాపురం మార్మోగింది. నాయుడు బజార్‌లో హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో అయోధ్య రామాలయ నమూనాను ముగ్గుతో వేశారు. రాత్రి ఇళ్ల వద్ద దీపోత్సవం ఏర్పాటు చేశారు.



పొదిలిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, వై.పాలెంలో రాములవారి కల్యాణం

## అవీ..ఇవీ..

### ఓటర్ల తుది జాబితా విడుదల



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం రూరల్ జనవరి 22: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా మార్కాపురం నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ఆదివారం విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 2,12,070 ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులు 1,06,777 మంది, మహిళలు 1,05,288 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నట్లు తెలిపారు. మార్కాపురం మండలంలో 41,207 మంది ఓటర్లు, మార్కాపురం పట్టణంలో 55,305, తర్లుపాడు మండలంలో 25,936, కొనకనమిట్ల మండలంలో 38,072, పొదిలి మండలంలో 22,283, పొదిలి పట్టణంలో 29,267 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ జాబితాలో ఓటర్లకు ఏమైనా మార్పులు, చేర్పులు, తొలగింపులు అవసరమైన వారు ఫామ్-6, 7, 8లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులందరూ నూతనంగా విడుదల చేసిన ఈ జాబితాను పరిశీలించి తప్పొప్పులను ఓటర్ల నమోదు అధికారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

### ఎర్రగొండపాలెంలో 2,05300 మంది ఓటర్లు

ఎర్రగొండపాలెం, జనవరి 22 : నియోజకవర్గంలో ఇప్పటివరకు ముద్రించిన ఓటర్ల జాబితాలో 2,05,300 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారని ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఆర్వో జి.సువర్ణమ్మ సోమవారం పేర్కొన్నారు. వై.పాలెం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఫైనల్ పబ్లికేషన్ ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఐదు మండలాల తహసీల్దార్లు, రాజకీయపార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో 2,05,300 మంది ఓటర్లుకుగాను 1,04,222 మంది పురుషులు, 1,01,077 మంది మహిళలు ఓటర్లుగా ఉన్నారన్నారు. మరో 700 పైగా ధరఖాస్తులు సవరణలు చేయాల్సి ఉన్నాయన్నారు. అవి పరిశీలించి వారికి కూడా వచ్చే ఎన్నికలకు ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ప్రకటించిన ఓటర్లు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సవరణకు ధరఖాస్తు చేయాలన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా పరిశీలించాలన్నారు. అర్హత ఉండి ధరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి ఓటరుగా నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొని వారి అభిప్రాయాలను ఆర్వోకు తెలిపారు.

### గుర్తింపు, గౌరవ వేతనం ఇవ్వాలి



ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరావు

గిద్దలూరు, జనవరి 22 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు, సంస్థల ప్రతినిధులకు గౌరవవేతనం అందించాలని, ఎన్‌జీవో కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు కోరారు. స్వచ్ఛంద సేవాసంస్థల జేఏసీ ఆధ్వర్యంలో గిద్దలూరులో జరిగిన సమావేశానికి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రజల కోసం కులమతాలకు తావులేకుండా దాతలు, సొంతనిధులతో అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారన్నారు. సంస్థలకు గుర్తింపు, గౌరవ వేతనం అందజేసి తమవంతు సహకారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వచ్ఛంద సంస్థల గిద్దలూరు యూనిట్ అధ్యక్షులుగా రెడ్డిమల్లారెడ్డి, కోకన్వీనర్‌గా మాగులూరి శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు నాయబ్‌రసూల్, నాగేశ్వరరావు, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఏపీజీఈఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఏపీజీఈఈ నాయకులు

మార్కాపురం వన్ టౌన్, జనవరి 22: స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఏపీజీఈఈఏ తాలు కా యూనిట్-2024 నూతన క్యాలెండర్ ను సోమవారం ఆవిష్క రించారు. కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షులు కె.చెంచిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి బుడేసాహెబ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### లైసెన్స్‌లు తీసుకోకుంటే చర్యలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 22: పట్టణంలోని షాపుల యజమానులు ట్రేడ్ లైసెన్స్ ఖచ్చితంగా పొందాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. పట్టణంలోని పలు దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. కాలం చెల్లిన వస్తువులు అమ్మకూడదని, 120 మైక్రాన్ల మందం కంటే తక్కువ కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదన్నారు. దుకా ణాల యజమానులు వీధుల్లో, కాలువలలో చెత్తను వేయకుండా పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు.

## రేంజ్‌లో మరికొందరు సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 22 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రేంజిలో సీఐల బదిలీల పరంపర కొనసాగుతోంది. దీనిలోభాగంగా సోమవారం మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సీఐ బి.పాపారావును తిరుపతి జిల్లా గూడూరు 1వటౌన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీవుల్లాను ప్రకాశం జిల్లా దర్శి సీఐగా నియమించారు. దర్శి సీఐ జె.రామకోటయ్యను గుంటూరు రేంజి వీఆర్‌కి బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ కే.అజయ్‌కుమార్‌ను నెల్లూరు జిల్లా దిశ 2 సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న టి.విజయ్ కృష్ణను ప్రకాశం సీసీఎస్ కు బదిలీ చేశారు. ప్రకాశం సీసీఎస్‌లో ఉన్న పి.బాలాజీని గుంటూరులోని రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.



## ఎస్సీలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం

- టీడీపీ ఇన్‌చార్జ్ నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 22: ఎస్సీ వర్గాలను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 15వ వార్డులో ఎస్సీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎస్సీలకు కార్పొరేషన్ ద్వారా రాయితీ నిధులు, ఇంటి పన్ను రద్దు, రోడ్లు వేశారన్నారు. 100 యూనిట్లకు కరెంట్ బిల్లులు లేకుండా చేశామన్నారు. ఇప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ పథకాలను తుంగలో తొక్కి చెత్తపన్ను కూడా వేసీ ఎస్సీలపై భారం మోపిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమిని ఆదరించాలన్నారు.

## హామీలకే పరిమితమైన సాగర్ కాలువపై రెండో వంతెన

**అమలుకాని మంత్రి సురేష్ హామీ**



సాగర్ కాలువపై ఇరుకుగా ఉన్న వంతెన

త్రిపురాంతకం, జనవరి 22: భక్తులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సాగర్ కాలువపై రెండో వంతెన నిర్మాణానికి ప్రభుత్వ పెద్దల మాట హామీలకే పరిమితమైంది. త్రిపురాంతకం నుంచి ఆలయానికి చేరుకోవడానికి, తిరుగు పయనం కావడానికి ఒకే ఒక మార్గం ఉంది. ఆ మార్గ మధ్యలో సాగర్ కుడి కాలువ ఉంది. కాలువ నిర్మాణ సమయంలోనే సుమారు 12 అడుగుల వెడల్పుతో వంతెన కూడా నిర్మించారు. ఇప్పటికీ త్రిపురాంతకం నుంచి ఆలయాలకు, చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, లేళ్లపల్లి, దువ్వలి, వైపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెన నుంచే ప్రయాణించాలి. కానీ ఏటా మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో వంతెన వద్ద ట్రాఫిక్ నిలుస్తోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మూడు గంటల నుంచి ఐదు గంటల పాటు ట్రాఫిక్‌లో భక్తులు చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి భక్తులు వంతెనను వెడల్పు చేయాలని, రెండో వంతెనను నిర్మించాలని కోరుతున్నా అధికారులుకానీ, ప్రజా ప్రతినిధులు కానీ దీనిపై దృష్టి సారించలేదు.. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డేవిడ్‌రాజు అదిగో, ఇదిగో అని కాలయాపన చేశాడు. 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చి, గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ 2020, 2021లలో జరిగిన సమీక్షల సందర్భంగా వంతెనను నిర్మిస్తామని మంత్రి హోదాలో హామీ ఇచ్చారు. అది కూడా అలానే కాలగర్భంలో కలిసిపోయింది. మళ్లీ 2022 ఫిబ్రవరిలో జరిగిన ఉత్సవాల సమీక్షలో కూడా మంత్రి హోదాలో మూడోసారి కూడా ఇదే హామీని వినిపించారు. వచ్చే ఏడాది ఉత్సవాల నాటికి ఎట్టి పరిస్థితులలోనూ వంతెనను నిర్మించి భక్తులకు ట్రాఫిక్ సమస్య లేకుండా పరిష్కరిస్తామన్నారు. 2023లో మళ్లీ అదే తంతు. అది కూడా నీటి మూటగానే మిగిలింది. దీనికి తోడు ఆలయాల వద్ద భక్తులకు శాశ్వత మరుగుదొడ్ల ఏర్పాటు హామీ కూడా ఇదే పరిస్థితి. అమ్మవారి ఆలయం వద్ద అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేందుకు మరుగుదొడ్లు లేకపోవడం భక్తులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో నెలన్నర రోజులలో ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. గత హామీలపై మంత్రి, అధికారులు ఏం చేస్తారో అని భక్తులు ఎదురు చూస్తున్నారు.

## వైసీపీతో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, జనవరి 22 : గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజలపై అనేక రూపాలలో భారం పెంచారన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ కానుకలను ప్రజలకు అందించలేకపోయారని విమర్శించారు. మద్య నిషేధం చేశాకే రాష్ట్ర ప్రజలను ఓటు అడుగుతానని చెప్పిన జగన్ గడిచిన నాలుగున్నర ఏళ్లలో నాసిరకం మద్యాన్ని విక్రయించి ప్రజల రక్తమాంసా లను కూడా దోపిడి చేశాడన్నారు. ఆర్‌టీసీ, కరెం టు చార్జీలు పెంచి చెత్త పన్ను వేసిన ముఖ్య మంత్రిగా జగన్ నిలిచాడన్నారు. ఉపాధి పనుల కోసం ఇతర ఊర్లకు వలసలు వెళ్ళాల్సిన పరిస్థితి కూలీలకు నెలకొందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాన్వావలి, నాయకులు బిల్లా రమేష్‌యాదవ్, మైనారిటీ అధ్యక్షులు షేక్ అహమ్మద్‌భాషా, బీసీ నాయకులు కుసుమాల మహనందియాదవ్, మోపూరి పుల్లయ్య బద్రి బాషా తదితరులు పాల్గొన్నారు.



## సమయపాలన పాటించేలా చూడాలి

కంభం, జనవరి 22 : కంభం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ప్రైవేటు క్లీనిక్‌లు నడుపుకుంటూ వారికి ఇష్టం వచ్చిన సమయానికి వచ్చి హాజరువేసుకుని వెళుతున్నారని జిల్లా వైద్యశాఖాధికారికి రాష్ట్రషెడ్యూలు కులాల పరిరక్షణ సమితి అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఫిర్యాదు చేశారు.. హెచ్‌డీఎస్ ఫండ్స్ దుర్వినియోగం అవుతున్నాయని పేర్కొన్నారు. వైద్యశాలకు వచ్చే ప్రతి అత్యవసర కేసులను పేదరోగులకు వైద్యం అందించకుండా మరో వైద్యశాలలకు పంపిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఇవ్వడం లేదన్నారు వెంటనే కంభం వైద్యశాల వైద్యులపై విచారించి తగిన చర్యలు తీసుకో వాలని, సూపరిటెండెంట్‌ను కూడా మార్చాలని కోరారు.

# అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

- అంగన్‌వాడీ దీక్షా శిబిరాల తొలగింపు
- చలో విజయవాడ అడ్డగింత

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 22: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సోమవారం పోలీసులు తొలగించారు. విజయవాడ సభకు పాల్గొనేందుకు కొంతమంది అంగన్‌వాడీలు బయలుదేరి వెళ్లగా వారు దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. ఈలోపే పోలీసులు శిబిరాన్ని తొలగించి వచ్చిన అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అంగన్‌వాడీలు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

**కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె**

పెద్ద దోర్నాల : స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిర్వహిస్తున్న నిరసన దీక్ష సోమవారం కొనసాగింది. ప్రభుత్వ మొండివైఖరి వీడాలని తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మీ, కుమారి, సుబ్బమ్మ, ముంతాజ్‌బేగం, వెంకటరత్నం, సుహాసిని, రాణి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలను మేడపి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను, వాహనాన్ని స్టేషనుకు తరలించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో మధ్యాహ్నం తరువాత అంగన్‌వాడీలను తిరిగి వారి స్వగ్రామాలకు పంపించారు.

పొదిలి : చలో విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. నిర్బంధించి అనంతరం ఇళ్లకు పంపారు. పాదయాత్రలో స్వయంగా జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చమంటే వాటిని పరిష్కరించకుండా ఇంతటి దారుణానికి ఒడిగట్టడం ఏమిటని అంగన్‌వాడీలు ప్రశ్నిస్తున్నారు.

గిద్దలూరు : నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు విజయవాడలో జరిగే మహాధర్నాకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. సుమారు 120 మంది అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సోమవారం సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా, ఎస్మా ప్రయోగించినా, అరెస్టులు చేసినా భయపడేది లేదని అంగన్‌వాడిలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, సీఐటీయూ నాయకులు ఆవులయ్య నరసింహులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : జీతాలు పెంచాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం చలో విజయవాడ ధర్నాకు వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసులు ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఆదివారం సాయంత్రం నుంచి ఎర్రగొండపాలెం నుంచి విజయవాడ వెళ్లే రోడ్లపై పోలీసులు తనిఖీ చేశారు. యూనియన్ అధ్యక్షురాలు మల్లేశ్వరిని ఆదివారం సాయంత్రం విజయవాడ వెళుతుండగా పల్నాడు జిల్లా అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఎర్రగొండపాలెం పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం ధర్నా శిబిరం వద్ద స్థానిక పోలీసులు టెంట్‌లు తొలగించారు. ధర్నాకు వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసుస్టేషన్ ఆవరణలో ఉంచారు. అందుకు ఆగ్రహించిన అంగన్వాడీ కార్యకర్తలు పోలీసుస్టేషన్ ఆవరణలో నిరసనలు తెలిపారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలకు చెందిన 100 మందికిపైగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పోలీసుస్టేషన్‌లోనే నిరీక్షించారు.

అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు మల్లేశ్వరిని పోలీసు స్టేషన్‌కు తీసుకవచ్చారని, తమను స్టేషన్‌కు ఎందుకు బైండోవర్ చేశారని ప్రశ్నించారు. ఎస్‌ఐతో అంగన్‌వాడీ కార్యకర్తలు వాగ్వివాదానికి దిగారు. సాయంత్రం 8 గంటల వరకు పోలీసుస్టేషన్‌లోనే కార్యకర్తలు నిరీక్షిస్తున్నారు. ఎస్ఐ రాజేష్ మాత్రం బైండోవర్ పేపరుపై సంతకాలు చేసి వెళ్లాలన్నారు. సోమవారం సాయంత్రం 5 లోపు విధుల్లో చేరకుంటే తొలగిస్తామని అధికారులు, ఉత్తర్వులు ఇవ్వడంతో 40 మంది వరకు జాయినింగ్ రిపోర్టులో సంతకం చేసినట్లు సమాచారం.

**నిర్బంధాలతో పోరాటాలు ఆపలేరు..!**

కనిగిరి : నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని ఐద్వా సంఘ మహిళలు ప్రసన్న అన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ, సీఐటీయూ, ఐద్వా, ప్రజా సంఘాలను నిర్బంధించారు. అందులో భాగంగా అంగన్‌వాడీలకు ఎస్ఐ మాధవరావు నోటీసులు ఇచ్చారు. సోమవారం విజయవాడలో తమ కుమారులను కళాశాలలో వదిలి వచ్చేందుకు వెళ్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవరావును ఎస్.మాధవరావు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

ముండ్లమూరు : అంగన్‌వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సంఘం సహాయ కార్యదర్శి వెల్లంపల్లి అంజనేయులు మాట్లాడుతూ 41 రోజులుగా అంగన్‌వాడీ టీచర్లు శాంతియుతంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా చేస్తుంటే పట్టించుకోకుండా ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తోందన్నారు. చలో విజయవాడ పేరుతో వెళ్తున్న మహిళలపై లాఠీచార్జి చేయడం, ఈడ్చుకెళ్లడం వైసీపీ దుర్మార్గపాలనకు నిదర్శనమన్నారు. దిష్టి బొమ్మ దహనం చేస్తున్న సమయంలో ఎస్ఐ యూ వెంకటకృష్ణయ్య తన సిబ్బందితో వచ్చి అడ్డుకున్నారు. అక్కడున్న వారిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పంటా ఏడుకొండలు, బోడపాటి హనుమంతరావు, ఎర్రయ్య, మన్నం రామాంజనేయులు ఉన్నారు.

పీసీపల్లి : అంగన్‌వాడీల చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేయాలని వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది. దీంతో ఆదివారం, సోమవారం పోలీసులు అంగన్‌వాడీలు, ఆయాలకు నోటీసులు ఇచ్చారు. విజయవాడకు వెళ్లవద్దని హెచ్చరించారు. మొత్తం 30మందికి నోటీసులు ఇచ్చినట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

పామూరు : చలో విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను అరెస్టు చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు సయ్యద్ మౌలాలి అన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ మమ్మిడాడీ కూడలిలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వజ్రాల సుబ్బారావు, కే.ప్రభాకర్, పి.రఘునాథరెడ్డి, ఇండ్ల నరసింహారావు, సీఐటీయూ నాయకుడు షేక్ అల్లాభక్ష్, మహదేవయ్య, శంకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



మార్కాపురంలో ధర్నా చేస్తున్న మహిళలు



పొదిలిలో విజయవాడ వెళ్లే బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు, కనిగిరిలో పోలీసు స్టేషన్‌లో నిరసన

# రామనామంతో మార్మోగిన ఆలయాలు

- అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ వేళ కనులపండువగా శోభాయాత్ర
- ఆలయాలు, ఇళ్లల్లో వెలిగిన జ్యోతులు
- డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

కనిగిరి, జనవరి 22: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్ని ఆలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. కనిగిరిలోని రామాలయం, అంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శ్రీరాముని చిత్రపటం ముందు జై శ్రీరాం నామంలో జ్యోతులను వెలిగించారు. హనుమాన్ భజన సంఘం, వాసవీ సేవా సంఘం, రామాలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. జవహర్‌లాల్‌వీధిలోని హనుమాన్ భజన సంఘం మందిరంలో అంజనేయ పారాయణం, చాలీసా పఠించారు.

పామూరు : శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కనులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. బంగారు దుకాణాల లైన్‌లో ఆంజనేయస్వామి భక్తుడు తిరుమలశెట్టి శ్రీనివాసులు (నివాస్) ఆధ్వర్యంలో వడపప్పు, పానకం ప్రసాదాన్ని పంచిపెట్టారు. అన్ని ఆలయాల్లో, ఇళ్లల్లో సాయంత్రం రామ జ్యోతులను వెలిగించి ప్రజలు భక్తిపారవశ్యంలో మునిగారు. అలాగే బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మమ్మీ డాడీ సెంటర్‌లో మాజీ సర్పంచ్ సోమిశెట్టి వెంకట నారాయణ ఆర్థిక సాయంతో మిఠాయిలు, వడపప్పు, పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, వాసవీ మాత దేవస్థానం ఛైర్మన్ బాలకొండలు, టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ఉపాధ్యక్షుడు గంగరాజు యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు చినసుబ్బయ్య, సురేష్, హరగోపాల్, మహేంద్ర, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



కనిగిరి : శోభాయాత్రలో పాల్గొన్న భక్త జనం

పీసీపల్లి : పలు గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ఆలపించిన రామ నామస్మరణ మార్మోగింది. ప్రజలు ఆలయాలకు చేరుకుని భక్తరామదాసు కీర్తనలు ఆలపించారు. మండలంలోని పెదయిర్లపాడు గ్రామంలో రామభక్తులు సీతారామ, లక్ష్మణ, అంజనేయ చిత్రపటాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

దర్శి : రామాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణుని ఉత్సవ విగ్రహాలతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నారపుశెట్టి పాపారావు, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముండ్లమూరు : అయోధ్యలో జరిగిన ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తులు తిలకించి పులకించారు. మండలంలోని అన్ని రామాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ముండ్లమూరు, వేంపాడు, పసుపుగల్లు, భీ మవరం, సింగనపాలెం, వేముల, పులిపాడు, వెల్లంపల్లి, ఈదర, మారెళ్ళ, పో లవరం, పూరిమెట్ల, నూజెండ్లపల్లి గ్రామాల్లో ఎంతో వైభవంగా అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లూరు : దేవాలయాలు శ్రీరామ నామస్మరణలతో మార్మోగాయి. తూర్పుగంగవరంలో పురాతన కోదండ రామస్వామి ఆలయంలో ఆల య అర్చకులు సీతారామ దీక్షితులు, శ్రీనివాస దీక్షితులు అఖండ జ్యోతిని వెలిగించి ప్రత్యేక కార్యక్రమా లు నిర్వహించారు. విఠలాపురం, తాళ్లూరు, కొత్తపా లెం, బొద్దికూరపాడు తదితర గ్రామాల్లో శ్రీరాములవారి చిత్రపటాలను ఊరేగించారు. భక్తులు రామభజన, పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటా రామజ్యోతులను వెలిగించారు. పలు చోట్ల భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

దొనకొండ : ఆనంద ఆశ్రమం ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి నేతృత్వంలో సోమవారంపురవీధుల్లో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఆశ్రమం నుంచి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, దేవాలయాల ప్రతినిధులు మల్లెల రామిరెడ్డి, నరసింహులు, ఐలూరి సుబ్బారెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పద్మావతి, భక్తులు శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ ఉత్సాహంగా నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో సామూహిక హారతులిచ్చారు. గుట్టమీదపల్లికి చెందిన మల్లికార్జున (మల్లి) అన్నదానం, కనమర్లపూడి సురేష్ అల్పాహారం అందజేశారు.

## టీడీపీ ఆధ్వర్యంలో నేడు అన్నదానం

దొనకొండ, జనవరి 22 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ యువ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి నేతృత్వంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు భారీ కేకు కటింగ్‌తో పాటు అన్నదానం ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, ఫణిదపు వీరాంజనేయు లు కోరారు.

## ఇసుక తరలింపుపై ఫిర్యాదు

పీసీపల్లి, జనవరి 22 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నేరేడుపల్లి గ్రామానికి చెందిన కొంతమంది సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని నేరేళ్లవాగులో ఉన్న ఇసుకను గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల మైనింగ్ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసినా అక్రమార్కులు ఇసుక రవాణాను ఆపలేదని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో గ్రామ ప్రజలు కోరారు.

## సమాచారాన్ని పక్కాగా సేకరించాలి

పామూరు, జనవరి 22 : కులగణన సమాచారాన్ని పక్కాగా సేకరించాలని ఎం పీడీవో వీ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని చట్టుమడుగు గ్రామంలో కులగణన సర్వే ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలని తెలిపారు.

## అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి ఉండాలి

పామూరు, జనవరి 22 : కనిగిరి అసెంబ్లీ టికెట్ల కేటాయింపుల్లో పార్టీ అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని వైసీపీ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజానాయబ్‌రసూల్ సూచించారు. పార్టీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు జే గోవిందయ్య, శ్రీరాం శ్రీనివాసులు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ షేక్ చాంద్‌బాషా, వైస్ ఎంపీపీ షేక్ రషీద్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కోడి పందెం స్థావరంపై దాడి

పీసీపల్లి, జనవరి 22 : కోడి పందెం వేస్తున్న ముగ్గురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు మండలంలోని చినవరిమడుగు సమీపంలోని పొలాల్లో కోడిపందేలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో స్థావరంపై దాడిచేసి ముగ్గురి ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కోడి పుంజులు, రూ.3500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

## వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు

దర్శి, జనవరి 22 : వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువైందని అధికార పార్టీ నాయకులు వారిపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ బీసీ సెల్ ని యోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం జయహో బీసీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతుల కు గురిచేస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. బీసీల ఆత్మబంధువు చంద్రబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ. జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గె లిపించాలని కోరారు. సభలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నీలిశెట్టి నారాయణ, పార్లమెంట్ కార్యదర్శి అంకాల వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ తలారి కోటయ్య, తెలు గు యువత అధ్యక్షుడు కల్లూరి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వల్లెపు నారాయణ, జనసేన నాయకుడు కుప్పాల పాపారావు పాల్గొన్నారు.

## ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన లింగారెడ్డిపల్లి వాసులు



వైసీపీని వీడి టీడీపీలో చేరినవారితో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 22 : అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు 25 కుటుంబాలు టీడీపీ నాయకులు కమతం వెంకటేశ్వర్లు, అమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. వారికి ఉగ్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానన్నారు. ఐదు పనుల లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలయ్యే పథకాలు, వాటితో కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని కొత్తగా చేరిన వారికి తెలిపారు. ఏ ఇంటినీ వదలకుండా తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను, జగన్‌రెడ్డి అరాచక పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉగ్ర దిశానిర్దేశం చేశారు. పార్టీలోకి చేరేందుకు ఆశక్తిగా ఉన్న యువతను స్వాగతించాలన్నారు. పార్టీలో చేరిన అందరికీ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరూ ఐక్యతతో తన గెలుపునకు కష్టపడి పనిచేయాలని ఉగ్ర కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, యడవలి (నారపరెడ్డి) శ్రీనివాసులురెడ్డి, మాలపాటి ఓబులురెడ్డి, లింగారెడ్డిపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

ముండ్లమూరు, జనవరి 22 : మండలంలోని పసుపుగల్లుకు చెందిన టీడీపీ కార్యకర్త డోగిపర్తి మీరావలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ సోదరుడు గోపి మీరావలి కుటుంబ సభ్యుడు బ్రహ్మంకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వరగాని పౌలు, మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, గూడాల వెంకటేశ్వరరెడ్డి, చింతల రాజారెడ్డి, గోపిశెట్టి నాగార్జున, పవన్, నరేష్, కిరణ్ ఉన్నారు.

## విద్యార్థులు రాజ్యాంగ ఆవశ్యకతను తెలుసుకోవాలి

తాళ్లూరు, జనవరి 22 : విద్యార్థి దశనుంచే రాజ్యాంగ ఆవశ్యకతను తెలుసుకోవాలని ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు అధ్యక్షతన లక్కవరం జడ్పీహైస్కూల్‌లో రాజ్యాంగ ప్రవేశిక ఫొటో ఎగ్జిబిషన్‌ను సోమవారం నిర్వహించారు. రాజ్యాంగంలో ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, భావ ప్రకటన, విశ్వాసం, నమ్మకం, ఆరాధనలో స్వేచ్ఛను సమానంగా ఇచ్చినట్లు తెలిపారు. డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని 17, 21 ఆర్టికల్ ప్రకారం కులం, మతం, వైకల్యం పేరుతో వి వక్ష చూపరాదని సూచించి సమాన హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణకుమార్, ఉపాధ్యాయులు జి.పూర్ణయ్య, వెంకాయమ్మ, కోటేశ్వరరావు, మనోజ్‌కుమార్, చిరంజీవి, నాగమణి పాల్గొన్నారు.





# జిల్లా ఓటర్లు..

# 12,75,540

ఎట్టకేలకు తుది ఓటర్ల జాబితా విడుదలైంది. స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024లో చివరి అంకం పూర్తయింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఒక సాఫ్ట్, ఒక హార్డ్ కాపీలను అందజేసింది. అలానే సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లోనూ ఓటర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనందున ఇంకా ఎవరైనా ఓటు పొందలేకపోయి ఉంటే వారు కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. అలానే ఎవరైనా చనిపోయినా, చిరునామా మారినా సంబంధిత దరఖాస్తులను పెట్టుకోవచ్చు.

- మహిళా ఓటర్లే అధికం
- స్వల్పంగా పెరిగిన ఓట్లు
- పారదర్శకంగా రూపొందించామన్న కలెక్టర్
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేత
- ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో..

బాపట్ల, జనవరి22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ పూర్తయింది. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం ఓటర్ల జాబితాను కలెక్టర్ పి.రంజిత్‌బాషా విడుదల చేశారు. తుది ప్రచురణలో జిల్లావ్యాప్తంగా ఉన్న మొత్తం ఓట్లు 12,75,540గా పేర్కొనగా ఇందులో పురుషులు 6,22,526 మంది ఉన్నారు. మహిళల వాటా 6,52,941గా ఉంది. పురుష ఓటర్లతో పోలిస్తే 30,415 మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్యలో 2,41,081 ఓట్లతో అద్దంకి ప్రథమస్థానంలో ఉండగా, 2,26,566 ఓట్లతో రేపల్లె రెండో స్థానంలో నిలిచింది. ఇక వరుసగా పర్చూరులో 2,25,770, చీరాలలో 1,98,643, వేమూరులో 1,95,756, 1,87,724 ఓట్లతో బాపట్ల చివరి స్థానంలో నిలిచింది. ప్రతి నియోజకవర్గంలోనూ పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లే ఆధిక్యంలో ఉండడం విశేషం.

### ఫాం7ల దుర్వినియోగం కూడా కారణమే..

పాలకపార్టీ ఫాం7ల దుర్వినియోగానికి పాల్పడడం వల్ల చాలాచోట్ల అర్హులైన వారి ఓట్లు కూడా తీసివేశారని ప్రతిపక్ష టీడీపీ ఆరోపిస్తోంది. అందువల్లే ఆశించిన స్థాయిలో పెరుగుదల నమోదు కాలేదని, ఒక్క పర్చూరులోనే ఫాం7లతో పదివేలకు పైగా ఓట్లు తొలగించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చనే వాదనను టీడీపీ చేస్తోంది. వీటితో పాటు సిమిలర్ ఎంట్రీలలో గందరగోళం తలెత్తడం వల్ల కూడా దాదాపు 3,000 ఓట్లకు పైగా కోత పడిందని సమాచారం. ఇవే కాకుండా సాంకేతిక కారణాల వల్ల ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోనివి దాదాపు 5,000 దరఖాస్తులు ఉండడం గమనార్హం.

### ఓటర్ల పెరుగుదల స్వల్పంగానే..

ఎన్నికల ఏడాదిలో విడుదల చేసే ఓటరు జాబితాలో సహజంగా గణనీయంగా ఓటర్ల సంఖ్యలో పెరుగుదల నమోదవడం రివాజు. కానీ సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ప్రచురణలో ఆశించిన స్థాయిలో జిల్లాలో పెరుగుదల కనబడలేదు. 2023 జనవరి 5న విడుదల చేసిన ఫైనల్ పబ్లికేషన్‌లో జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 12,52,432గా చూపెట్టగా ప్రస్తుతం విడుదల చేసిన తుది జాబితాలో ఆ సంఖ్య 12,75,540కే పరిమితమైంది. గతేడాది తుది ప్రచురణతో పోలిస్తే కేవలం 23,108 ఓట్ల పెరుగుదల మాత్రమే నమోదు కావడం గమనార్హం. గతేడాది అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే ఈ వృద్ధి 12,408 ఓట్లకే పరిమితమైంది.

### ఫాం6లు 70,000కు పైనే...

కొత్త ఓటు నమోదుకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి దాదాపు 70,000కు పైనే ఫాం6లు యంత్రాంగానికి అందాయి. వీటిల్లో తిరస్కరణ కూడా పదిశాతానికి మించలేదు. కానీ మరణాలకు సంబంధించి అధిక ఓట్లు తొలగించడం, కొత్త ఓటు నమోదు విషయంలో ఆశించిన స్థాయిలో యువత నుంచి స్పందన కనబడకపోవడం కూడా ఎన్నికల ఏడాదిలో ఓటర్ల పెరుగుదల నామమాత్రంగానే ఉందన్న విమర్శలు వినబడుతున్నాయి. కొత్త ఓటు నమోదు విషయంలో రాజకీయ పార్టీల ఆసక్తి తప్పితే యువతకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన డానికి ప్రస్తుతం ఎన్నికల కమిషన్ విడుదల చేసిన గణాంకాలే నిదర్శనంగా కనబడుతున్నాయి.

**బాపట్ల జిల్లాలోని 6నియోజకవర్గాలలో ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | థర్డ్‌జండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| వేమూరు | 94,875 | 1,00,872 | 9 | 1,95,756 |
| రేపల్లె | 1,11,071 | 1,15,475 | 20 | 2,26,566 |
| బాపట్ల | 91,309 | 96,409 | 6 | 1,87,724 |
| పర్చూరు | 1,10,256 | 1,15,508 | 6 | 2,25,770 |
| అద్దంకి | 1,18,159 | 1,22,910 | 12 | 2,41,081 |
| చీరాల | 9,68,56 | 1,01,767 | 20 | 1,98,643 |
| మొత్తం | 6,22,526 | 6,52,941 | 73 | 12,75,540 |


### ఓటర్ల తుది జాబితా అత్యంత పారదర్శకం: కలెక్టర్

ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం ఓటర్ల జాబితాను విడుదల చేశారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ ప్యాట్స్ యంత్రాలన్నీ రాజకీయ పార్టీల సమక్షంలో మొదటి దశ పరిశీలన పూర్తయిందన్నారు. జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో విద్యుత్, తాగునీరు, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు అన్ని సిద్ధం చేశామన్నారు. రాజకీయపార్టీలు నుంచి వచ్చిన 39,754 ఫిర్యాదులను స్వీకరించి సమగ్రంగా విచారణ జరిపించామన్నారు. గత ఏడాది జనవరి 6వ తేది నుంచి ఇప్పటివరకు 1,84,292 దరఖాస్తులు నమోదు అయ్యాయన్నారు. 1,55,426 విచారించామన్నారు. 28,547 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. తప్పులు ఫిర్యాదులు చేసిన వారిని గుర్తించి ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. పర్చూరు నియోజకవర్గంలో తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.పర్చూరు ఈఆర్‌వో ఫిర్యాదు మేరకు 58మంది పై 16 కేసులు నమోదు చేశామని, ఛార్జిషీట్ వేశామని వివరించారు. వారందరికి నిబంధనల మేరకు 41వ నోటీసులు జారీ చేశామన్నారు. సమావేశంలో ఆర్డీవో పి.వెంకటరమణ, ఆరు నియోజకవర్గాల ఈఆర్‌వోలు పాల్గొన్నారు.


ఓటర్ల తుది జాబితాను ప్రకటించి వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్.

### పల్నాడు జిల్లాలో.. 17,12,829

పల్నాడు జిల్లాలో స్వల్పంగా ఓట్లు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 17,12,829 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. పురుషుల కంటే మహిళల ఓటర్లే అధికంగా ఉన్నారు. 8,37,200 మంది పురుషులు, 8,75,433 మంది మహిళలు, థర్డ్ జండర్ 196 మంది ఓటర్లుగా ఉన్నారు. పురుషుల కంటే మహిళల ఓట్లు 38,233 అధికంగా ఉన్నాయి. అత్యధికంగా గురజాల నియోజక వర్గంలో 2,71,277 ఓట్లు నమోదు కాగా తక్కువగా పెదకూరపాడు నియోజకవర్గంలో 2,28,936 ఓట్లు ఉన్నాయి. ఓటర్ల జాబితా సవరణకు ముందు గత ఏడాది జనవరిలో 16,86,524 ఓట్లు ఉండగా సవరణ అనంతరం 17,12,829 ఓట్లు పెరిగాయి. ఏడాది కాలంలో 24,779 ఓట్లు పెరిగాయి. ఫారం -6లు 1,39,671 అందగా 1,10,345 ఆమోదించగా 24,400 దరఖాస్తులను తిరస్కరించారు. ఫారం-7లు 1,34,669 దరఖాస్తులు దాఖలు కాగా 1,02,790 ఆమోదించగా 28,403 తిరస్కరించారు. ఫారం-8లు 1,07,568 దాఖలయ్యాయి. వీటిలో 97,654 ఆమోదించి 5,715 తిరస్కరించారు. ఈ మూడు రకాల దరఖాస్తులు 3,81,908 దాఖలయ్యాయి. వీటిలో 3,10,789 ఆమోదించగా 58,518 తిరస్కరించారు. కొత్తగా 1,11,178 ఓట్లు నమోదు కాగా 1,03,788 ఓట్లు తొలగించారు. తొలగింపుల్లో 60,678 మృతుల, 30,907 ఓట్లు వలసదారులు, 12,203 డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయి.




### గుంటూరు జిల్లాలో.. 17,72,022

తుది ఓటర్ల జాబితా ప్రకారం గుంటూరు జిల్లా ఓటర్ల సంఖ్య 17,72,022కి చేరింది. జిల్లాలో 9,13,852 మంది ఓటర్లతో మహిళలు తమ పైచేయిని నిలబెట్టుకొన్నారు. తద్వారా మొత్తం ఓటర్లలో 51.65 శాతంగా ఉన్నారు. పురుషులు 8,55,262, ట్రాన్స్ జెండర్లు 191 కలిపి మొత్తం ఓటర్లు 17,69,305 మంది ఉన్నారు. వీళ్లు కాక ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు పురుషులు - 724, మహిళలు 206, సర్వీసు ఓటర్లు పురుషులు 1714, మహిళలు 73 కలిపి మొత్తంగా 17 లక్షల 72 వేల 022కి ఓటర్ల సంఖ్య చేరుకొన్నది. ముసాయిదా ఓటర్ల జాబిత ప్రచురించేనాటికి 17,37,447 మంది ఓటర్లున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే చేర్పులు, తొలగింపులు అనంతరం 34,575 మంది ఓటర్లు పెరిగారు. అలానే 18-19 ఏళ్ల వయస్సు ఓటర్లు 14,399 మంది ఉంటే ఆ సంఖ్య నేడు 35,762కి పెరిగింది. 80 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 31,800, దివ్యాంగులు 14,270 మంది ఓటర్లున్నారు. లింగ నిష్పత్తి ప్రతీ 1000 మంది పురుషులకు 1069 మంది మహిళలున్నారు. ఎలక్టోరల్ పాపులేషన్ రేషియో ప్రతీ వెయ్యి మంది పౌరుల్లో 730 మంది ఓటర్లున్నారు.



## నాడు-నేడుకు నిధుల గ్రహణం

- విడుదల కాని నిధులు
- శ్లాబ్‌దశ దాటి ముందుకు కదలని అభివృద్ధి పనులు
- వాటర్‌ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్‌కు నిధుల్లేవ్..
- మరోమూడు నెలల్లో ముగియనున్న విద్యాసంవత్సరం


లాలుపురం జడ్పీస్కూల్‌లో అసంపూర్తిగా భవనాలు

ఒక చోట శ్లాబ్ పూర్తయినా అంతర్గత గోడల నిర్మాణం జరగ లేదు.. మరో చోట ఇంకా శ్లాబ్ దశలోనే వెక్కిరిస్తున్న నిర్మాణాలు.. ఇంకో చోట ఎలక్ట్రికల్, పంబ్లింగ్ పనుల్లో జాప్యం.. మరోచోట వాటర్ ప్లాంట్స్ వచ్చినా ఇన్‌స్టలేషన్‌కు నిధులు లేక పరదాలు కప్పి నెట్టుకొస్తున్న వైనం.. ఇదీ ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనుల దుస్థితి. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో పనులు చేయడం లేదు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం నిర్మాణాలు అందుబాటులోకి వస్తాయో లేదోననే అనుమానం ప్రధానోపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు(విద్య), జనవరి 22: ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనులు రెండు విడతల్లో ప్రారంభం అయ్యాయి. మొదటి విడత దాదాపు 1,170 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా రెండో విడత 680 పాఠశాలల్లో నిర్మాణాలు ప్రారంభించారు. నాడు నేడు పనుల్లో ప్రధానంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, బెంచీల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు ఏర్పాటు, ఆర్వోప్లాంట్స్ నిర్మాణం ఇలా అనేక పనుల్ని ఇందులో చేర్చారు. తొలి విడతతో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసిన అనేక పనులు ఇంకా పూర్తిదశకు చేరుకోలేదు. ఇక రెండో దశ పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి.

### నిధుల విడుదల ఏదీ?

ప్రభుత్వం నాడు నేడు పనులతో సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని సొంత డప్పు కొట్టుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనేక స్కూల్స్ మొదటి రెండో విడత నాడు నేడు పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తి ఉన్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని స్కూల్స్ విషయం అటుంచితే గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం(ఏటీ అగ్రహారం), పట్టాభిపురం మున్సిపల్ స్కూల్, కొల్లిశారద మున్సిపల్ స్కూల్ (కేవీపీ కాలనీ,) లాలుపురం జడ్పీ స్కూల్(వికలాంగుల కాలనీ) ఇలా అనేక చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని స్లాబ్ పూర్తిగా కొన్ని ఫినిషింగ్ దశలో మరికొన్ని పిల్లర్స్ స్థాయిలో పనులు ఉన్నాయి.

### వాటర్‌ప్లాంట్ మిషన్లకు ముసుగేశారు..

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనుల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో అనేక స్కూల్స్‌కు వాటర్ ప్లాంట్స్ యంత్రాలు వచ్చాయి. వాటిని ఇన్‌స్టాల్ చేయడానికి కూడా నిధులు లేవు. ఒక్కో యంత్రం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖరీదు చేస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏజన్సీలు వీటిని తీసుకువచ్చి పాఠశాల ప్రాంగణాల్లో పెట్టి ముసుగేశారు. వీటిని ఇన్‌స్టలేషన్ చేయడానికి నిర్దేశించిన ప్రాంతంలో షెడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. షెడ్డు నిర్మాణం పూర్తి కాకుండానే వాటర్‌ప్లాంట్స్ మిషన్లు పాఠశాలలకు పంపారు. ఇప్పుడు అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉన్నాయి. కాంట్రాక్టర్లు నిధులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచిపోయినట్లు చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరం నాడు నేడుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు అందుబాటులోకి వస్తాయో లేదో వేచి చూడాలి. మరోవైపు నాడు నాడు పనుల సిమెంట్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, శానిటరీ మెటీరియల్‌తో తరగతి గదులు, ఇసుక, కంకర, ఇనుము వంటి మెటీరియల్‌తో పాఠశాలల్లో ఆటస్థలాలు నిండిపోయాయి. ఈ విద్యాసంవత్సరం నాడు నేడుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు అందుబాటులోకి వస్తాయో లేదో వేచి చూడాల్సి ఉందని హెచ్‌ఎంలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


గుంటూరు ఎన్జీవోకాలనీలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో ముసుగు వేసిన వాటర్‌ప్లాంట్ మిషన్

## అంగన్‌వాడీలపై..వేటు

- బాపట్ల జిల్లాలో 917 మంది వర్కర్స్..
- 878 మంది హెల్పర్స్‌పై చర్యలకు సిద్ధం

బాపట్ల, జనవరి22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం అంగన్‌వాడీలు పిలుపిచ్చిన చలో విజయవాడ కార్యక్రమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఆదివారం అర్థరాత్రి నుంచే పోలీసులు రైల్వేస్టేషన్లను, బస్‌స్టేషన్లను జల్లెడ పట్టడం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా ఆదివారం అర్థరాత్రి సమయంలో బాపట్ల రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే విజయవాడకు వెళ్లేదారుల న్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకుని ప్రయాణ వివరాలు అడిగి తెలుసుకున్నాకే అనుమతించారు.


బాపట్ల రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలు

### ఇళ్ల దగ్గర ఉన్న వారిని సైతం..

ఇంటి దగ్గర ఉన్న అంగన్‌వాడీలను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చీరాలలో అంగన్‌వాడీలను అరెస్టు చేసి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అద్దంకిలో వారి ధర్నాకు సంఘీభావం ప్రకటించిన సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్యను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాపట్ల టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో కలిపి 18 మంది అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని సాయంత్రం వరకు అక్కడే ఉంచారు.

### తాము విధుల్లో ఉన్నామని చెబుతున్నా..

తాము ఇప్పటికే విధుల్లో చేరామని చెబుతున్నా వినకుండా పోలీస్ స్టేషన్‌కు తరలించారని బాపట్లలోని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారం ఉదయం లోపల విధులకు హాజరవుదామనుకున్న అంగన్‌వాడీలను సైతం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడంతో ఖాకీల వైఖరిని వారు తప్పుబడుతున్నారు.

### 917 మంది వర్కర్స్, 878 మంది హెల్పర్స్..

ప్రభుత్వం హెచ్చరించినట్లుగానే జిల్లావ్యాప్తంగా 917మంది వర్కర్స్, 878 మంది హెల్పర్స్‌పై టెర్మినేషన్ కొరడా విధించడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైల్ సోమవారం సాయంత్రమే కలెక్టర్ వద్దకు వెళ్లగా తొలగింపునకు ఆయన ఆమోద ముద్ర వేశారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి తొలగించిన అంగన్‌వాడీలకు నోటీసులను అందించనున్నారు. 949 మంది వర్కర్స్, 945 మంది హెల్పర్స్ సోమవారం ఉదయానికే విధుల్లో చేరారు. పోలీసుల అత్యుత్సాహంతో సోమవారం విధుల్లో చేరదామనుకున్న అంగన్‌వాడీలు సైతం ప్రభుత్వం వేసిన వేటుకు బలవనున్నారు.

## అద్దంకిలో వైసీపీకి.. భారీ షాక్

- ఎమ్మెల్యే రవికుమార్‌తో భేటీ అయిన అట్లా చినవెంకటరెడ్డి
- ఎంపీపీ, తొమ్మిది మంది ఎంపీటీసీలు, 12మంది సర్పంచ్‌లు
- త్వరలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం
- వైసీపీలో విభేదాలే కారణమా!

అద్దంకి, జనవరి 22: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీకి మంచి పట్టు ఉన్న సంతమాగులూరు మండలంలో ఊహించని విధంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీకి ఏకపక్షంగా జరిగిన సంతమాగులూరు మండలంలో అత్యధిక శాతం ప్రజాప్రతినిధులు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌తో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డి, ఎంపీపీ యలమందతోపాటు మరో తొమ్మిది మంది ఎంపీటీసీలు, 12మంది సర్పంచ్‌లు జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో సమావేశమైనట్లు తెలుస్తోంది. సంతమాగులూరు మండలంలో గత స్థానిక సంస్థల ఎన్నికలలో 17 ఎంపీటీసీలు వైసీపీకి ఏకగ్రీవం అయ్యాయి. 20 గ్రామపంచాయతీల్లో 90శాతం వైసీపీ సానుభూతిపరులు ఎన్నికయ్యారు. అట్లా చినవెంకటరెడ్డి ఎంపీపీగా ఎన్నికై ఇటీవల వరకు పని చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో చినవెంకటరెడ్డి ఎంపీపీగా రాజీనామా చేశారు. తన అనుచరుడుగా ఉన్న పాతమాగులూరు ఎంపీటీసీ యలమందను ఎంపీపీగా చేయటంలో సఫలీకృతులయ్యాడు.

### గుర్తింపు ఇవ్వకపోవడంతోనే..

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన పాణెం హనిమిరెడ్డి బాధ్యతలు స్వీకరించే సమయంలో అట్లా చినవెంకటరెడ్డి వర్గానికి సరైన గుర్తింపు ఇవ్వకపోగా, ప్రత్యర్థి వర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం కూడా మరింత ఆగ్రహం తెప్పించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో 20 రోజుల క్రితం నర్సరావుపేటలో తన అనుచరులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా కూడా వైసీపీ ఇన్‌చార్జ్‌కి అల్టిమేటం ఇచ్చినట్లు తెలిసింది. వైసీపీలో తమ వర్గానికి సరైన గుర్తింపు ఉండదన్న నిర్ణయానికి వచ్చిన అట్లా తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సోమవారం రాత్రి జొన్నతాళి వద్ద రవికుమార్ క్యాంప్ కార్యాలయలో ఎంపీపీ యలమంద, తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు, 12మంది సర్పంచ్‌లతో వెళ్లి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. త్వరలో చంద్రబాబు సమక్షంలో అందరూ కలిసి టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### నేతలతో ఇన్‌చార్జి బేరాలు

అయితే, ఇప్పటికే విషయం తెలుసుకున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంపీటీసీలతో బేరాలు మొదలుపెట్టినట్లు సమాచారం. అయితే ఏ ఒక్కరు కూడా వెనుకడుగువేసే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెప్పినట్లు తెలుస్తోంది. వైసీపీకి మంచి పట్టు ఉంటుందన్న సంతమాగులూరు మండలంలోనే అంచనాలు తల్లకిందులు కావటంతో వైసీపీ శ్రేణులను మరింత కలవరపాటుకు గురిచేసినట్లు తెలుస్తోంది. ఇదే బాటలో మిగిలిన మండలాల్లో కూడా పలువురు వైసీపీ నేతలు రాజీనామా చేసి టీడీపీ కండువాలు కప్పుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో అసలే అంతర్గత విభేదాలతో అంతంతమాత్రంగా ఉన్న వైసీపీకి ఇది కోలుకోలేని దెబ్బగా పలువురు అంచనా వేస్తున్నారు.


గొట్టిపాటి రవితో సమావేశమైన వైసీపీ నాయకులు

### కొనసాగుతున్న వర్గ విభేదాలు

బాపట్ల, జనవరి22(ఆంధ్రజ్యోతి): పర్చూరులోని వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం ఇటీవల సమావేశమయినట్లు తెలుస్తోంది. వీరంతా కూడా త్వరలోనే టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇదిలా ఉంటే సోమవారం చీరాలలో జరిగిన వైసీపీ సామాజికసాధికార బస్సుయాత్ర సభలో మంత్రి మేరుగ, ఎంపీలు నందిగం సురేష్, మోపిదేవి వెంకటరమణ తదితరులు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చీరాల నియోజకవర్గ అభ్యర్థి వెంకటేషేనని ప్రకటించారు. ఈనేపథ్యంలో పర్చూరు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తాడేపల్లిలోని సీఎంవోలో ముఖ్యనాయకులను కలిసినట్లు సమాచారం. ఆ సందర్భంగా గతంలో తనకు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ ఆ మేరకే అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. చీరాలలో జరిగిన బస్సుయాత్రకు ఆమంచి వర్గం గైర్హాజరు అయింది. ఆ క్రమంలోనే స్థానిక అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత ఇచ్చినట్లు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ వర్గీయులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే నిన్నమొన్నటి దాకా పర్చూరు నియోజకవర్గం నుంచి ఆమంచి పోటీ చేస్తారని బావించారు. అయితే అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా హనిమిరెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి వరకు అక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన కృష్ణచైతన్య వ్యతిరేక స్వరం వినిపించారు. ఆ క్రమంలో కృష్ణచైతన్యను పర్చూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని సీఎం జగన్ చెప్పినట్లు అందుకు చైతన్య, గరటయ్యలు సానుకూలంగా స్పందించలేదని ప్రచారం జరిగింది. వాస్తవానికి ఆమంచికే పర్చూరు టికెట్ కేటాయించే ఉద్దేశం ఉంటే కృష్ణ చైతన్యకు పర్చూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పార్టీ పెద్దలు సూచించడంలో ఆంతర్యమేమిటోన్న ప్రచారం రాజకీయవర్గాలతో పాటు సామాన్య జనంలోనూ చర్చ నడుస్తోంది.

## అభివృద్ధి పనుల్లో వివక్ష


పోడియం వద్దకు వెళ్ళి ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ కంపా రజనీ

అద్దంకి, జనవరి 22: టీడీపీ కౌన్సిలర్‌లు ప్రాతినిధ్యం వహించే వార్డుల లో మూడు సంవత్సరాలుగా చిన్న పాటి అభివృద్ధి పనులు చేపట్టకుండా వివక్ష చూపిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్‌లు ధ్వజమెత్తారు. అద్దంకి మున్సిపల్ సమావేశం సోమవారం ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా టీడీపీ కౌన్సిలర్‌లు జహీరా, కంపా రజనీ మాట్లాడుతూ సమస్యల ప్రస్తావనకు జీరో అవర్ ఏర్పాటుచేయాలని ఎన్నిసార్లు అడిగినా ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. త్వరలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. పట్టణంలో కనీసం పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ కూడా సరిగ్గా లేదన్నారు. పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు ఎదురుదాడికి సిద్ధం అవుతుండగా మాట్లాడే అర్హత వైసీపీ కౌన్సిలర్‌లకు లేదని, ఎమ్మెల్యే రవికుమార్ గతంలో సమావేశం కు హాజరైన సమయంలో గౌరవం ఇవ్వకుండా వ్యవహరించారని జహీరా ధ్వజమెత్తారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని కంపా రజనీ పోడియం వద్దకు వెళ్ళి ఛైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఛైర్‌పర్సన్ అర్జీలు నేరుగా తనకు ఇస్తే అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు పద్మేష్, అనంతలక్ష్మి, కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## అద్దంకి నియోజకవర్గంలో 2,41,081 మంది ఓటర్లు

అద్దంకి, జనవరి 22: అద్దంకి నియోజకవర్గంలో 2,41,081 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల వివరాలను సోమవారం అద్దంకి తహసీల్దార్ సుబ్బారెడ్డి తెలిపారు. పురుషులు 1,18,159 మంది కాగా, మహిళలు 1,22,910 మంది ఉన్నారు. 12 మంది థర్డ్ జండర్‌లు ఉన్నారు. అద్దంకి పట్టణంలో 14,961 మంది పురుషులు, 16,266 మంది మహిళలు, ఐదుగురు థర్డ్ జండర్‌లు ఉన్నారు. అద్దంకి రూరల్‌లో 19,370 మంది పురుషులు, 19,859 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్‌లు ఉన్నారు. సంతమాగులూరు మండలంలో 225,097 మంది పురుషులు, 25,560 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్‌లు ఉన్నారు. బల్లికురవ మండలంలో 21,672 మంది పురుషులు, 21,840 మంది స్త్రీలు, ఒకరు థర్డ్ జెండర్ ఉన్నారు. జె.పంగులూరు మండలంలో 18,986 మంది పురుషులు, 20,034 మంది మహిళలు, కొరిశపాడు మండలంలో 18,073 మంది పురుషులు, 19,351 మంది మహిళలు ఉన్నారు. అన్ని మండలాలలో పురుషులు కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

## పర్చూరులో మహిళా ఓటర్లు ఆధిక్యం

పర్చూరు, జనవరి 22: పర్చూరు నియోజవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. సోమవారం ప్రకటించిన ఓటర్ల జాబితాలో నియోజకవర్గం మొత్తం ఓటర్లు 2,25,770 ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 110256, మహిళా ఓటర్లు 115508, థర్డ్ జండర్ ఆరుగురు ఉన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఓటర్ల సంఖ్య కొంత తగ్గింది. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా పర్చూరు నియోజవర్గంలో పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపునకు ఫాం-7 నమోదు కావటం చర్చనీయాంశంగా మారింది. ఓట్ల తొలగింపు విషయంలో అధికారుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒక సీఐతోపాటు, ముగ్గురు ఎస్సైలపై సస్పెండ్ వేటు పడింది. ఎన్నికల కమిషన్ చర్యలతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్


మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రవికుమార్

బల్లికురవ, జనవరి 22: మండలంలోని కె.రాజుపాలెం లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. టీడీపీ కార్యకర్త పంతంగి మైసయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి గృహానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే, కొణిదెనలో ప్రభుత్వ ఉద్యోగి అయిన తాళ్లూరి విద్యాసాగర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ కార్యకర్త నాగభైరు బ్రహ్మయ్య మనుమడు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. పోతినేని శ్రీనివాసరావు తల్లి పున్నమ్మ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నేతలు జాష్టి శ్రీరంగనాయకులు, చెరుకూరి రామంజనేయులు, తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, జనవరి 22: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో విజయలక్ష్మి మెడికల్ షాపు సహకారంతో కిమ్స్ హాస్పిటల్ వారు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామాంజనేయులు, వైద్య సిబ్బంది పలురకాల వ్యాధులకు సంబంధించిన 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగ నిర్ధారణ జరిగిన 65 మందిని ఒంగోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు రఫీ తెలిపారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ లత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

మార్టూరు, జనవరి 22: రోడ్డు దాటుతున్న అట్లూరి కోటేశ్వరమ్మ(64) అనే వృద్ధురాలిని లారీ ఢీకొనడంతో మృతి చెందారు. ఈసంఘటన సోమ వారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై అంబేడ్కర్ నగర్ ఎదురుగా చోటుచేసుకుంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన మృతురాలు కోటేశ్వరమ్మ, మరో ముగ్గురు మహిళలతో కలిసి యద్దనపూడి గ్రామంలోని చర్చికి ప్రార్థనకు వెళ్లడానికి రోడ్డు దాటుతున్నారు. అదేసమయంలో గుంటూరు వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ముగ్గురు మహిళలు ప్రమాదం నుండి తప్పించుకున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, జనవరి 22: రోడ్డు ప్రమాదంలో యవకుడు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం పంగులూరు సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కొండమంజులూరుకు చెందిన చొప్పవరపు మోజెస్ (27) పంగులూరులో బంధువుల ఇంట జరిగిన ఓకార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. పంగులూరు సమీపంలో చప్టావద్ద వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మోజెస్ అద్దంకిలోని పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య రాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రేణంగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్ల జాబితాలు సిద్ధం

బల్లికురవ, జనవరి 22: మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం ఓటర్ల జాబితాలను సచివాలయాలలో అందుబాటులో ఉంచినట్టు తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో ఓటర్ల జాబితాలను బూత్ లెవల్ అఫీసర్లకు రవిబాబు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే అన్ని గ్రామాలలో ఉన్న సచివాలయాల నోటీస్ బోర్డులో ఓటర్ల జాబితాలను పెట్టాలన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే వెంటనే ఓటర్లు బీఎల్వోలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జ్ ఆర్ఐ అశోక్ పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలి

చీరాలటౌన్, జనవరి 22: ప్రతి ఒక్కరికి సంతోషకరమైన ఆరోగ్యం అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.సుధ పేర్కొన్నారు. రమేష్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదులకు బీపీ, షుగర్, కిడ్నీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో న్యాయమూర్తి హాజరయి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు, న్యాయవాదులు పుల్లెల హరిబాబు, నిర్వాహకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అంతా రామమయం

» వైభవంగా శోభాయాత్ర

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు


మార్టూరు: గన్నవరంలో జరిగిన శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు

చినగంజాం, జనవరి 22: మండల పరిధిలోని పలుగ్రామాల్లో రాములోరి శోభాయాత్రను సోమవారం వైభవంగా నర్వహించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో సీతారాముల కల్యాణం, శోభాయాత్రలు, అన్నదానాలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో మందిర కమిటీ సభ్యులు, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు అభిషేకాలు, పుష్ప యాగం, హరేరామ సంకీర్తన, శోభాయాత్ర ను నిర్వహించారు. సోపిరాల గ్రామంలో సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్రను గ్రామ పురవీధులలో వైభవంగా జరిపారు. అడవీధిపాలెంలో సీతారాయుల చిత్రపటంతో గ్రామస్థులు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కడవకుదురులో వేంచేసియున్న సీతాలక్ష్మణహనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

### అద్దంకిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తులసిదళంతో అర్చన, పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అద్దంకి, జనవరి 22: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అద్దంకిలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తులసీదళంతో అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని గీతామందిరంలో సీతారాముల విగ్రహాలకు అభిషేకం, అర్చన నిర్వహించారు. 27 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రామనామ సంకీర్తన, రామయాగం నిర్వహించారు. కార్యక్రమంలో నాగసూరి హరి, నాగేశ్వరరావు, చామర్తి హనుమంతరావు, అర్వపల్లి హనుమంతరావు, లక్కరాజు చంద్రశేఖర్, తమ్మన శ్రీనివాసరావు, కొంజేటి సాయి, నాగసూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. వేలమూరిపాడు రోడ్డులో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉసిర మొక్కలతో పాటు పలురకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో దొడ్డపునేని భాస్కరరావు, రాచమల్లు శివాంజనేయులు, మన్నం త్రిమూర్తులు, నర్రా శ్రీలక్ష్మి, కరి రామయ్య, నాగరాజకుమారి, గడ్డమడుగు ప్రసన్నాంజనేయులు, రాచమల్లు మోహనకృష్ణ, పేరం సుధాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పర్చూరులో రాముని చిత్రపటాలతో గ్రామోత్సవం

### ఆలయాల్లో భక్తుల సందడి

మార్టూరు, జనవరి 22: మండలంలోని తాటివారిపాలెం కోదండరామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మార్టూరులోని తూర్పు బజారున యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాత్రి మహిళలు కోటి దీపోత్సవం చేశారు. రాత్రి సమయంలో మహిళలు ఇంటిముందు దీపాలను వెలిగించారు. యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో సోమవారం రాత్రి భక్తులు సీతా రామచంద్ర స్వామి శోభా యాత్ర నిర్వహించారు.

ఇంకొల్లు: అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రతేక పూజలు నిర్వహించారు. ఇంకొల్లు రామమందిరంలో సప్తాహం, నాగులచెరువుకట్ట వద్ద అభయాంజనేయస్వామి దేవాలయంలో ఏకాహం నిర్వహించారు. పలు దేవాలయాల్లో భక్తులు నిర్విరామంగా భజనలు చేశారు.

### కన్నుల పండువగా రాములవారికి పూజలు

చీరాల జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానిక పట్టాభి స్వీట్స్ సమీపంలో సోమవారం యూత్ ఆధ్వర్యంలో రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన ప్రతి ఒక్కరికి అవసరమన్నారు.

అలాగే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆయన కుమారుడు గౌరీ అమర్నాథ్ రాములు వారికి ప్రత్యేక చేశారు.. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ భక్తి భావంతో ఉండాలన్నారు. పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పర్చూరు: రామనామ స్మరణ గ్రామగ్రామాన మార్మోగింది. సోమవారం శ్రీరాముని చిత్రపటాలు, జెండాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, కోలాట భజన కార్యక్రమాలు నిర్వహించారు. రామనామ స్మరణలతో గ్రామాలు మార్మోగాయి.

కార్యక్రమంలో భాగంగా పర్చూరులోని శ్రీఅద్దంకి నాంచారమ్మ సేవా మండలి ఆధ్వర్యంలో పెద్దఎత్తున గ్రామోత్సం నిర్వహించారు.

# వేడెక్కిన రాజకీయం

» చీరాలలో వెంకటేష్, తాడేపల్లిలో ఆమంచి » అద్దంకిలో టీడీపీలోకి వలసలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. చీరాలలో అధికార వైసీపీ సాధికారబస్సు యాత్ర నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే, పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తాడేపల్లి వెళ్లి రాష్ట్ర నేతలతో మంతనాలు నిర్వహించడం గమనార్హం. బస్ యాత్రలో పాల్గొన్న రాష్ట్ర నేతలు చీరాల వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కరణం వెంకటేష్‌ను గెలిపించాలని కోరగా, తాడేపల్లి వెళ్లిన ఆమంచి చీరాల బీసీ అభ్యర్థికి ఇవ్వాలని పట్టుబట్టడం గమనార్హం. మరోవైపు అద్దంకి నియోజకవర్గంలో వైసీపీకి చెందిన కొందరు నేతలు, పలువురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీంతో రెండు నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది. చీరాల ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్ ప్రస్తుత వైసీపీ ఇన్‌చార్జిగా ఉండగా అతని కోసం ఆపిన బస్ యాత్రను సోమవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మోకాలిదెబ్బతో వైద్యశాలలో ఉన్న వెంకటేష్ కోసం బస్ యాత్రను ఆపి ఆయన వచ్చాక సోమవారం నిర్వహించారు. బస్‌యాత్రలో పోటీ చేసే అభ్యర్థులపై వైసీపీ అధిష్ఠానం స్పష్టత ఇస్తున్న విషయం విదితమే. తదనుగుణంగా సోమవారం బస్ యాత్రలో వెంకటేష్ పేరును అధిష్ఠానం ప్రకటిస్తున్న విషయం ముందుగానే వెల్లడైంది. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న చీరాల మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి హడావుడిగా సోమవారం మధ్యాహ్నం తాడేపల్లి చేరారు. అక్కడ ఆయన ఆ పార్టీ ముఖ్య నేతలు సజ్జల, విజయసాయిరెడ్డితో పాటు సీఎంవో ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డిని కూడా కలిసినట్లు తెలిసింది.

చీరాల అభ్యర్థిగా కరణం వెంకటేష్ పేరును ప్రకటించొద్దని డిమాండ్‌ను ఆయన వారి ముందు ఉంచినట్లు సమాచారం. తనకు చీరాలలో బీసీ అభ్యర్థికి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యే బలరాం ఆయన కుమారుడికి అద్దంకిలో అవకాశం ఇస్తామని చెప్పాకే తాను పర్చూరు పార్టీ బాధ్యతలు చేపట్టానని ఆమంచి వారితో అన్నట్లు తెలిసింది. అందువల్ల బస్‌యాత్ర సభలో చీరాల వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్‌ను అభ్యర్థిగా ప్రకటించవద్దని కోరినట్లు సమాచారం. రాత్రి పొద్దుపోయే వరకు ఆయన సీఎంవో వద్దే వారితో మంతనాలు జరుపుతున్నారు. అదే సయమంలో చీరాలలో జరిగిన బస్‌యాత్ర సభలో పాల్గొన్న నేతలు చీరాల నుంచి కరణం వెంకటేష్ పోటీ చేస్తారని, ఆయన్ను గెలిపించాలని స్పష్టమైన ప్రకటన చేశారు. మంత్రి మేరుగ నాగార్జునతోపాటు ఎంపీ మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్‌లు వారి ప్రసంగాల్లో చీరాలలో వెంకటేష్‌ను గెలిపించాలని రాష్ట్రంలో మళ్లీ జగన్ సీఎం కావాలని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పార్టీ అధిష్ఠానం ఇక్కడ విస్పష్ట ప్రకటన చేయడం గమనార్హం.

కాగా అద్దంకి నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. సంతమాగులూరు మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డితోపాటు ఆ పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు, 12మంది సర్పంచ్‌లు టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు వారంతా సోమవారం రాత్రి జొన్నతాళి వద్ద అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే రవికుమార్‌తో మంతనాలు జరిపారు. త్వరలో వారందరూ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నట్లు సమాచారం. వైసీపీ నేతలు తమకు పట్టు ఉందని భావిస్తున్న సంతమాగులూరు మండలం నుంచి టీడీపీలోకి వలసలు ప్రారంభం కావడంతో ఆ నియోజకవర్గంలోనూ రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# బీసీలను మోసం చేసిన వైసీపీ

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


టీడీపీలో చేరిన నాగరాజుపల్లికి చెందిన కుటుంబాలు

మార్టూరు, జనవరి 22: కల్లబొల్లి మాటలతో బీసీలను వంచించి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల బీసీ నాయకులతో జయహో బీసీ సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సదస్సుకు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఏలూరి మాట్లాడుతూ బీసీలను నమ్మకద్రోహం చేసిన జగన్‌ను ఇంటికి పంపించడానికి అందరూ నడుంబిగించాలన్నారు. బీసీలకు రాజ్యాంగ పదవులు లభించకూడదనే దురుద్దేశంతో స్థానిక సంస్థలలో ఉన్న 24 శాతం రిజర్వేషన్ శాతాన్ని పది శాతానికి తగ్గించిన ప్రభుత్వానికి బీసీల సత్తా చూపించాలన్నారు. తొలుత జయహో బీసీ వాహనాలను ఏలూరి జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌతవరపు జనార్దన్, గుంజి వెంకట్రావు, కోడూరు శేషబ్రహ్మాచారి, నక్కల రాఘవ, సింగయ్య, రామాంజనేయులు, షేక్ రజాక్, వాసు, రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో పది కుటుంబాలు చేరిక

మార్టూరు, జనవరి 22: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యానాదుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన పది యానాది కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే వారి సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వెల్లంపల్లి అంకమ్మరావు, బుదురి పవన్, పొట్లూరి ఏసుదాసు, రాపూరి దుర్గాప్రసాద్, బుదూరి మహేంద్ర, విజయ్‌కాంత్, నాగరాజుపల్లి గ్రామ టీడీపీ నాయకులు మిన్నెకంటి రవికుమార్, సోమ్లానాయక్, రాజానాయక్, రాముడునాయక్ పాల్గొన్నారు.

అలాగే, మార్టూరు గ్రామానికి చెందిన వైసీపీ యువనేత పుట్టా అయ్యప్ప స్వామి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయన సతీమణి నవ్య 17వ వార్డు మెంబరుగా కొనసాగుతున్నారు. ఆయనకు ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి ఏలూరి కష్టపడి పనిచేసేతీరు నచ్చడంతో పార్టీలో చేరినట్లు అయ్యప్పస్వామి తెలిపారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

పర్చూరు, జనవరి 22: జనసేన, తెలుగుదేశం పార్టీ సమన్వయంతో పనిచేసి నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించి అధికారం సాధిస్తామని జనసేన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ కన్వీనర్ ఆలా అనిల్ కుమార్ అన్నారు. కేంద్ర ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం పర్చూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి కుంటుపడిందన్నారు. పార్టీ శ్రేణులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేనులు కారంపూడి తేజ, పద్మ, తరుణి గోపాల కృష్ణ, తులసి బాస్కర్, తులసి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలను తొలగిస్తే మూల్యం చెల్లించక తప్పదు!

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హెచ్చరిక

» అక్రమ అరెస్టులపై ధ్వజం


మార్టూరు పోలీస్ స్టేషన్ వద్ద పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు

బల్లికురవ, జనవరి 22: ఎన్నికలకు ముందు వైసీపీ ఇచ్చిన హామీలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమ మార్గంలో తొలగిస్తే ఈ ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. సోమవారం బల్లికురవ మండలం కె.రాజుపాలెం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అన్యాయంగా మగ పోలీసులచే అరెస్టు చేయించి బస్సులలో రోడ్లపై తిప్పటం అనాగరిక చర్య అని ఆయన విమర్శించారు. ధర్నా చౌక్ వద్ద అంగన్ వాడీ కార్యకర్తలు చేస్తున్న దీక్షను అర్ధరాత్రి భగ్నం చేయటం హేయమైన చర్య అని అన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాలతో వస్తున్న వారిని అడ్డుకోవడం పిరికి పంద చర్య అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అధికారంలోకి రాక ముందు అబద్ధపు హామీలు ఇచ్చి చిరు ఉద్యోగులను తీవ్రంగా మోసం చేశారని చెప్పారు. ఇప్పుడు మాట తప్పటంతో పాటు వారిని చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాలలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రశ్నిస్తే కేసులు, ఉద్యమిస్తే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ఎమర్జెన్సీని తలపించేలా వైసీపీ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం హిట్లర్ పాలనను తలపిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదని, వారికి టీడీపీ అండగా ఉంటుందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

### అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

బల్లికురవ, జనవరి 22: తమ సమ్మెపై ప్రభుత్వం పట్టించుకోవటం లేదని సోమవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టారు. అక్కడికి వెళ్లేందుకు సిద్ధపడగా పోలీసులు అరెస్టు చేసి బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఎన్నిరకాల బెదిరింపులకు గురిచేసిన తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కేంద్రాలను తెరవాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు శ్రీదేవి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలో సీఐటీయూ నాయకుడిని, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు జారీచేసి ఆదివారం అర్ధరాత్రి చినగంజాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాకు అనుమతి లేదంటూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్‌కు, చినగంజాం, సోపిరాలకు చెందిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసులు నోటీసులు అందజేసి అదుపులోకి తీసుకున్నారు. తాము విధుల్లో చేరుతున్నామని కార్యకర్తలు పోలీసులకు తెలపడంతో సోమవారం ఉదయం విడుదల చేశారు.

మార్టూరు: అంగన్‌వాడీలు సోమవారం విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. మార్టూరు సమీపంలో గుంటూరు వైపు రెస్ట్ ఏరియా వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. విజయవాడకు కారులో వెళుతున్న మండలంలోని ఆరుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే, మరికొంత మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. యద్దనపూడి మండలంలోని కార్యకర్తలు విజయవాడ ధర్నాకు వెళ్లగా అక్కడ వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విజయవాడలో సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

చీరాలటౌన్: తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుండగా అరెస్ట్ చేయడం అన్యాయమని పలువురు అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో తలపెట్టిన కార్యక్రమం అడ్డుకునేందుకు గాను చీరాల పట్టణ, రూరల్ పరిధిలో పలువురు కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అయినా అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు అరెస్టులు లెక్కచేయకుండా ముందుగానే విజయవాడకు చేరకుని కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైసీపీ చీరాల అభ్యర్థి వెంకటేష్!

» స్పష్టం చేసిన మంత్రి మేరుగ, ఎంపీలు నందిగం, మోపిదేవి



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, పక్కన కరణం వెంకటేష్

చీరాల జనవరి 22: వచ్చే ఎన్నికల్లో వైసీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేషేనని ఆపార్టీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. సీఎం జగన్ మాటిస్తే తప్పరని అన్నారు. చీరాలలో వెంకటేష్‌ను ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా మరలా జగన్ వచ్చేందుకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మెపిదేవి వెంకట రమణ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వరికూటి అమృతపాణి స్పష్టం చేశారు. వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా సోమవారం సాయంత్రం చీరాల గడియారస్తంభం సెంటర్‌లో వెంకటేష్ అధ్యక్షతన సభ జరిగింది. ఈసందర్భంగా మేరుగ, నందిగం, మోపిదేవి తదితరులు మాట్లాడుతూ వైసీపీ చీరాల అభ్యర్థిగా ఎవరో వస్తారని, ఏదో జరుగుతుందన్న ప్రచారాలను నమ్మవద్దన్నారు. వీటిల్లో ఎటువంటి నిజం లేదని గ్రహించాలన్నారు. జిల్లా రాజకీయాల్లో వెంకటేష్ ప్రభావం అత్యంత కీలకంగా ఉంటుందన్నారు. నమ్మినవారి కోసం పనిచేసే వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ బీరక సురేంద్ర తదితరులు మాట్లాడుతూ 175 స్థానాలకు 175 స్థానాలు గెలిపించుకునే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలసి పని చేయాలన్నారు. ముందుగా హాజరయిన ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించా రు. ఆ తరువాత ఆయన సభలో పాల్గొనలేదు. కాలికి తగిలిన దెబ్బతో కట్టుతోనే వాకర్ సహాయంతో స్టేజీ ఎక్కిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అధ్యక్షతన సభ కొనసాగింది. వెంకటేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చీరాల నుంచి గెలిచి జగన్‌కు కానుక ఇచ్చేందుకు ఎంత దూరమైనా వెళతామన్నారు. ముందుగా కౌన్సిలర్ బత్తుల అనీల్ ఆహుతులకు ఆహ్వానం పలికారు.


యువ గళానికి జనహారం... నవ శకానికి మణిహారం...
లోకేష్ గారి జన్మదినోత్సవ సంబరం...
అశేష జనం... అభినందన చందనం.....
యువగళం సారధి...
నవశకం వారధి...
యువత కోసం
భవిత కోసం నవత కోసం...
నడుం కట్టిన యువ కెరటం...
తెలుగుదేశం పార్టీ
జాతీయ ప్రధాన కార్యదర్శి
శ్రీ నారా లోకేష్ గారి
జన్మదినోత్సవ సందర్భంగా
హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలియజేసుకుంటున్నాము.
ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో
జరుపుకోవాలని మనసారా కోరుకుంటూ...
శ్రీ నారా లోకేష్ గారు
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి
మీ
దగ్గుమళ్ళ ప్రసాదరావు
IRS (చిన్నబుజ్జి)
ఛైర్మన్ : రాదేయ్ గ్రూప్



**జైశ్రీరామ్..!!** నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో దీపోత్సవం

## జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ !.. రామనామ స్మరణతో జిల్లా పులకింత

పల్లె నుంచి పట్టణం దాకా... పేద నుంచి పెద్ద వరకు... గడప గడపనా, వీధి వీధినా, ఊరూవాడా ఒకటే స్మరణ అదే 'జై శ్రీరామ్'. అయోధ్యలోని భవ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో జిల్లా అంతటా రామ నామం మారుమోగింది. ప్రతిష్ఠా క్రతువును టీవీలు, ఫోన్లలో ప్రత్యక్షంగా వీక్షించిన ప్రజలు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. చిరునవ్వులు చిందిస్తున్న చిన్ని రామయ్య రూపును దర్శించి తన్మయత్వంతో పులకించిపోయారు. సాయంత్రం దీపాలు వెలిగించి రఘునాథుడిపై ఉన్న అచంచల విశ్వాసాన్ని, భక్తిప్రపత్తులను చాటుకున్నారు.



ఉలవపాడు : వేణుగోపాలుడి ఆలయ ప్రాంగణంలో ఎల్ఈడీ స్క్రీన్‌లో అయోధ్య సన్నివేశాలను తిలకిస్తున్న భక్తులు

## పలువురు సీఐ, ఎస్ఐల బదిలీ

నెల్లూరు (క్రైం) : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు రేంజ్ పరిధిలోని 23 మంది సీఐలను, జిల్లాలోని 17 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్ సీఐ షైమారావును బుచ్చిరెడ్డిపాలెం అర్బన్‌కు, పాత గుంటూరు అర్బన్ సీఐ మొగిళ్లి వెంకట సుబ్బారావును బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న బీవీవీ. సుబ్బారావును గుడ్లూరు సర్కిల్‌కు, ఎస్సీ, ఎస్టీ సెల్ (ప్రకాశం)లో ఉన్న కె అజయ్‌కుమార్‌ను నెల్లూరు దిశ-2 ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. అలాగే, జిల్లాలో విధులు నిర్వహిస్తూ స్థానికత కలిగి ర్యాంకర్లు అయిన 17 మంది ఎస్ఐలను ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు ఐజీ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. అలాగే ఇతర జిల్లాల నుంచి 17 మంది ఎస్ఐలను జిల్లాకు కేటాయించారు.

## జిల్లా ఓటర్లు 19,08,498

- మహిళలు 9,73,089, పురుషులు 9,35,195

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,08,498 మంది ఓటర్లు ఉన్నట్టు లెక్కతేల్చారు. విశేషమేమంటే అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 9,35,195 మంది కాగా, మహిళా ఓటర్లు 9,73,089 మంది ఉన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ నారీమణులే అధికంగా ఉండటం విశేషం. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 2,67,750 మంది, కోవూరులో 2,61,182 మంది ఓటర్లతో ద్వితీయ స్థానంలో ఉంది. కందుకూరులో 2,26,765, కావలి 2,34,230, ఆత్మకూరు 2,12,939, కోవూరు 2,61,182, నెల్లూరు సిటీ 2,37,736, నెల్లూరు రూరల్ 2,67,750, సర్వేపల్లి 2,29,139, ఉదయగిరిలో 2,38,757 ఓటర్లు ఉన్నట్టు గుర్తించారు. కాగా, కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ హరినారాయణన్ సమావేశమై తుది ఓటర్ల జాబితాను వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసంహ తదితరులు పాల్గొన్నారు.

### ఆగిన ఇసుక కొనుగోళ్లు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : రీచ్‌ల వద్ద రోడ్ల మరమ్మతుల పేరుతో అదనపు వసూలు చేయడంపై ట్రాన్స్‌పోర్టర్లు గళం విప్పారు. శనివారం ఇందుకూరుపేట మండలంలో రెండు రీచ్‌ల వద్ద ట్రాక్టర్, టిప్పర్ల యజమానులు ఆందోళన చేశారు. అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అన్ని రీచ్‌లలో సోమవారం ఇసుక కొనుగోళ్లు ఆపేశారు.

## 4,624 మంది అంగన్‌వాడీలపై వేటు

- 2,408 మంది టీచర్లు, 2,218 మంది హెల్పర్లు విధుల నుంచి తొలగింపు

నెల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని అత్యంత బాధాకరమైన ఘటన చోటు చేసుకుంది. డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగిన అంగన్‌వాడీల బతుకులను ప్రభుత్వం ఒక్క కలం పోటుతో అతలాకుతలం చేసింది. 4,600 మంది అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను ఒక్కసారిగా విధుల నుంచి శాశ్వతంగా తొలగించింది. తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. వీరిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోగా సమ్మెను నీరుగార్చే ప్రయత్నాలను చేసింది. ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. ఎందుకు ఉద్యోగాల నుంచి తొలగించకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అయినా అంగన్‌వాడీలు వెనక్కు తగ్గలేదు. ఈ రోజు కాకపోతే రేపైనా ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశతో దీక్షలు కొనసాగించారు. అయితే ఎవరి ఊహకు అందని విధంగా సమ్మెలో ఉన్న అంగన్వాడీలందరినీ ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శిశు సంక్షేమ శాఖ అధికారులు సోమవారం రాత్రి సమ్మెలో ఉన్న 4వేల పైచిలుకు అంగన్‌వాడీలను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించారు. జిల్లాలోని 2408 మంది అంగన్‌వాడీ టీచర్లను, 2218 మంది హెల్పర్లను (మొత్తం 4,624 మంది) శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు మాతా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనసుజన్ తెలిపారు. మరోవైపు అంగన్‌వాడీ, ప్రజాసంఘాల నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నెల్లూరులో అంగన్వాడీలు ప్రదర్శన నిర్వహించారు.



కందుకూరు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

# ఊరూవాడ రామనామ స్మరణ

## ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు ● పలుచోట్ల శోభాయాత్రలు



కందుకూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న రామభక్తులు



ఆత్మకూరు : రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పట్టణ ప్రముఖులు

**అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలోని మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శ్రీరామ భజనలు, సీతారాముల కల్యాణం, పల్లకీసేవ, శోభాయాత్రలు ఇళ్లపై కాషాయ జెండాల ఆవిష్కరణ, గృహాల్లో దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకున్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.**

**కందుకూరు, జనవరి 22:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని అంకమ్మ ఆలయం వద్ద రామభక్తుల ఆధ్వర్యంలో డాక్టరు తన్నీరు మల్లికార్జున అయోధ్య విశేషాలను ప్రజలు తిలకించేందుకు స్క్రీన్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వడపప్పు, పానకం, ప్రసాదాలను పంచిపెట్టారు. పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో కోదండరాముడికి పుష్పయాగం నిర్వహించారు. పామూరురోడ్డులోని రామాలయంలోను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**లింగసముద్రం:** స్థానిక ఆర్యవైశ్యుల కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. కొండాపురం మండలం తూర్పుపాలెంకి చెందిన శివనాగక్షేత్రం ప్రతినిధులు శ్రీమన్నారాయణ, రాజేష్, మనోజ్, కృష్ణల ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు సీతారాముల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే లింగసముద్రం, కొండాపురం మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు స్వీట్లు, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**అల్లూరు :** నార్తుమోపూరులో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని ప్రత్యేక అలంకరించి గ్రామంలో ఊరేగిం చారు. అదేవిధంగా మండలంలోని అన్ని గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కలిగిరి :** మండలంలోని 23 పంచాయతీల్లో అయోధ్య రాముడి అక్షితలు, ఆలయ చిత్రాన్ని పంపిణీ చేసినట్లు సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ కర్రా భాస్కర్ తెలిపారు. ఆలయాల వద్ద భక్తులు రామనామ స్మరణలతో పూజలు నిర్వహించారు. కోలాటాల, భజన బృందాలు రామనామం జపిస్తూ నృత్యాలు చేశారు.

**బిట్రగుంట :** బోగోలు మండలంలోని బోగోలు, విశ్వనాథరా వుపేట, రామస్వామిపాలెం, కొత్తూరు, చెంచులక్ష్మీపురం, నాగులవరం, చెన్నారెడ్డిపాలెం, సుందరగిరివారి కండ్రికలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ జరిగాయి, తాటిచెట్లపాలెంలో గ్రామకాపులు వాయిల నాగరాజు, ప్రళయకావేరి బాబు, ఆవుల మోహన్‌రావు, తిరుపాలు ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. 300 మంది బైక్‌లపై జువ్వలదిన్నె నుంచి ఇస్కపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కొండబిట్రగుంటలో రాముని చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.

**కొండాపురం :** మండల పరిధిలోని అన్ని గ్రామాల రామాలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. అలాగే అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, ఆలయం ఫొటోలను భక్తులకు అందచేశారు. రాత్రి ప్రతి ఇంటివద్ద దీపాలు వెలిగించి రాముడికి ప్రత్యేక పూజలు చేశారు.



చేజర్లలో సీతారాముల వేషధారణ

**ఆత్మకూరు :** పట్టణంలోని వంటవీధిలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణం నిర్వహించారు. అయోధ్యలో కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు టీవీలను ఏర్పాటు చేశారు.

**సంగం :** సంగం సత్రం సెంటర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా శివాజీ సెంటర్, వివేకానంద సెంటర్, కొరిమెర్ల, దువ్వూరు, మర్రిపాడు, వంగల్లు తదితర గ్రామాల్లోని కోదండ రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అనంతసాగరం:** స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరం విశిష్టతను అర్చకులు భాను ప్రకాష్ తెలియజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

**చేజర్ల :** మండలంలోని ఆలయాల్లో సోమవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చేజర్లలోని లుంబిని విద్యాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించగా సీతారామ,లక్ష్మణ వేషదారణలో చిన్నారులు అలరించారు.



లింగసముద్రంలో పూజలందుకుంటున్న సీతారాములు

**ఉదయగిరి:** ఉదయగిరిలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. ఆనకట్ట సమీపంలో నుంచి శ్రీ రంగ నాయకుల ఆలయం వరకు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

**సీతారామపురం:** మండలంలో పలు గ్రామాల్లోని రామ మందిరాల్లో శ్రీ రాముని కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు రామ నామస్మరణతో భజనలు చేశారు.



సంగంలోని రామాలయంలో రామభక్తుల పూజలు



సీతారామపురం పడమటివీధి రామ మందిరంలో రామనామ స్మరణలో భక్తులు

**ఉలవపాడు :** అయోధ్యలో సోమవారం ఉదయం నుంచి ప్రారంభమైన బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అలాగే శ్రీరాముడి చిత్రపటం, కలశం ఏర్పాటు చేసి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, భజన బృందాలు, భక్తులతో నగర సంకీర్తన చేశారు.

**కావలి :** పట్టణంలోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, జై శ్రీరామ్ జెండాలు, రాములవారి ఫొటోలతో వెలిసిన ఫ్లెక్సీలతో అంతా రామమయంగా మారింది. రాములవారి చిత్రపటాలతో శోభయమానంగా చేపట్టిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని ఉత్తరంపేట రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడ నుంచి ర్యాలీగా దక్షిణంపేట రామాలయం వరకు కొనసాగించారు. ర్యాలీలో మహిళలు శ్రీరాముల వేషధారణలతో జయరామ జానకీరామ అంటూ ముందుకు సాగారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయాల కమిటీల బాధ్యులు, బీజేపీ, విశ్వహిందూపరిషత్ బాధ్యులు, వాసవీ వనితా క్లబ్ లెజెండ్ సభ్యులు, వాసవీ క్లబ్, సెవెన్ లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

---

# అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంగన్‌వాడీల ఆందోళన



కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

**కావలిటౌన్, జనవరి 22:** అంగన్‌వాడీల అక్రమ అరెస్టలను ఖండిస్తూ సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు పెంచలయ్య, మాల్యాద్రి మాట్లాడుతూ విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలపై దౌర్జన్యం చేయడం అనాగరిక చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో తిరు పాల్, కృష్ణమోహన్, యూనియన్ నేత లు రఘురావవమ్మ, సుభాషిణి, కళా వతి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

**కావలి రూరల్:** తమ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి నాలుగు బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారు జామున కావలి రూరల్ పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సీఐ శ్రీనివాసరావు బస్సులోని వారిని అంగన్‌వాడీలుగా గుర్తించి అనుమతులు లేకుండా చలో విజయవాడ వెళ్లటానికి లేదని వారిని స్టేషన్‌కు తరలించారు. అక్కడ మరుగుదొడ్లు, తాగునీరు కూడా సరిగాలేక ఇబ్బందులు పడ్డట్లు అంగన్‌వాడీలు తెలిపారు.



కందుకూరు : పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారంతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

**కావలిటౌన్:** విధుల్లో చేరాలని లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం జారీచేసిన నోటీసులను అంగన్వాడీలు తీసుకునేందుకు నిరా కరించారు. కావలి ప్రాజెక్ట్ పరిధిలోని దాదాపు 11,350 మంది అంగన్ వాడీ వర్కర్స్ హెల్పర్లు ఎవరూ విధులకు వెళ్లకుండా సమ్మెలో కొన సాగుతున్నారు.



ఆత్మకూరు : ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

**కందుకూరు:** అంగన్‌వాడీలు కందుకూరులో సోమవారం నిరసన ప్రద ర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ పోలీసుస్టేషన్‌ను ముట్టడించారు. తొలుత అంకమ్మ ఆలయం వద్ద నుంచి పోలీసుస్టేషన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పోలీసుస్టేషన్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. కందుకూరులో సీఐటీయూ నాయకులు జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్‌లను నోటీసులు ఇస్తామని ఓ లాడ్జికి పిలిపించి అక్కడ నిర్బంధించటం దారుణమని విమర్శించారు. ఈ సందర్భంగా పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, డీ రామమూర్తి, సాదు చెన్నకేశవులు, అంగన్‌వాడీల సంఘం నాయకులు వాకా లతారెడ్డి, ఎం. జయలక్ష్మి, ఎస్కే అమీరున్నీషా, కె. రాజేశ్వరి, రహంతున్నీషా, సిహెచ్ ఇందిరావతి, ప్రభావతి, శశికళ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిరూరల్ : నిరాహార దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

**బిట్రగుంట:** ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను అ రెస్టు చేయడం ఏమిటని బోగోలు మండల సీపీఎం, సీఐటీయూ నేతలు ప్రశ్నించారు. సోమవారం బోగోలు సీపీఎం కార్యాలయంలో నేతలు తుమ్మల వెంకయ్య, చల్లా నరహరి విలేకరులతో మాట్లాడారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఈనెల 24న బంద్ చేస్తున్నామని ప్రకటించారు.

**ఆత్మకూరు:** ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని సీపీఎం, సీఐటీయు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. విధుల్లో చేరని వారికి తొలగింపు ఉత్తర్వులు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసినా సోమవారం వారు విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సీపీఎం, సీఐటీయు, ప్రజా సంఘాల నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, జి శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మి, రూత మ్మ, విజయలక్ష్మి, శ్రీదేవి, ఏ మస్తా నమ్మ పాల్గొన్నారు.

**అనంతసాగరం:** స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని పోలీసులు అన్యాయంగా తొలగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు బెదిరింపులకు బెదిరేది లేదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు అన్వర్ భాష, వేమ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశ విధానాన్ని అవలంబించడం దారుణమని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగన్‌వాడీలకు మద్దతుగా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో రాష్ట్ర బంద్ చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, నాయకులు ఫరుద్దీన్‌భాష, కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల తొలగింపునకు రంగం సిద్ధం

**ఉలవపాడు :** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో విధులకు హాజరుకాని 314 మంది అంగన్‌వాడీలను తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సీడీపీవో వియజకుమారి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాలు ఉన్నాయి.

## రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

**ఆత్మకూరు, జనవరి 22:** మండలంలోని నువ్వూరుపాడు ఎస్సీ కాలనీలో సోమవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ. 10 లక్షలతో నిర్మించనున్న రామాలయం నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అప్పారావుపాళెంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన అప్పారావుపాళెంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, అంగన్వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, సిమెంట్ రోడ్లు, తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ చిట్టమూరి జితేంద్రనాగ్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల తొలగింపునకు ఆదేశాలు

**ఉదయగిరి, జనవరి 22:** ఉదయగిరి సీడీపీవో కార్యాలయం పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను తొలగించేందుకు సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ఆదేశాలు జారీచేశారు. ఉదయం 10 గంటల లోపు హాజరుకాని 64 మంది కార్యకర్తలు, 57 మంది హెల్పర్లను తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## తుది ఓటర్ల జాబితా ప్రకటన

**కావలి, జనవరి 22:** ఓటర్ల తుది జాబితాను సోమవారం ఆర్డీవో శీనానాయక్ ప్రకటించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 2,34,138 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 1,14,969 మంది స్త్రీలు 1,19,141 మంది, థర్డ్ జండర్స్ 28 మంది ఉన్నారన్నారు. అలాగే 3,403 మంది దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వారు 3,100 మంది, సర్వీస్ ఓటర్లు 92 మంది ఉన్నారని చెప్పారు. తుది ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్వోల వద్ద ఉందని, దాన్ని సరి చూసుకోవచ్చన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఏదైనా మార్పులు కాని ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ మాధవరెడ్డిలు పాల్గొన్నారు.

**లింగసముద్రం:** ఈసీ ఆదేశాల మేరకు సోమవారం మండలంలో ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. ఈసందర్భంగా తహసీల్దార్ టీ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో మొత్తం ఓటర్లు 30,791 మంది అని, వారిలో పురుషులు 15,448 మంది కాగా, మహిళలు 15,343 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

**సంగం:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు నాగరాజు తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో గతంలో మొత్తం 35,610 మంది ఓటర్లు ఉండగా 932 మంది ఓటర్లు తగ్గారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ఉదయగిరిరూరల్, జనవరి 22:** పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఆవరణలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దారు శ్రీనివాసులురెడ్డి, ఎంఈవో మస్తాన్‌వలి పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా ర్యాంపు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వసతి ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

## విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

**ఉదయగిరిరూరల్, జనవరి 22:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ట్యాబులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## న్యాయాధికారికి సత్కారం



న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోట్లూరి తదితరులు

**కావలి,జనవరి22:** స్థానిక అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారిగా సోమవారం జీ వి క్రమసిన్హా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఏజీపీ పోట్లూరి శ్రీనివాసులు, న్యాయవాదులతో కలిసి ఆయన్ను సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవరావు, జోసఫ్, కోమలి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

## బోగోలు మాజీ సర్పంచి మణెమ్మ మృతి

**బిట్రగుంట, జనవరి 22:** బోగోలు మాజీ సర్పంచు బోగిరి మణెమ్మ (57) గుండెపోటుతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ వీరరఘు, సీనియర్ నాయకులు అంకులయ్య, రమణయ్య గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయిబ్‌రసూల్, ప్రసాద్ తదితరులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే టీడీపీ నాయ కులు కావ్య కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరావు, సుధీర్‌బా బు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మహిళ నేత అరుణమ్మ, సురేష్, ప్రముఖ న్యాయవాది శి వప్రసాద్‌రెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నేతలు అంతరాజు, జహీర్, జాన్‌సన్, పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పీ.వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జయరాజ్ తదితరులు మణెమ్మకు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పక్వానికి వచ్చిన పొగాకు ఆకులనే రెలపాలి

**వలేటివారిపాలెం, జనవరి 22 :** పొగాకులో పక్వానికి వచ్చిన ఆకులనే రెలపాలని కందుకూరు- 2వ వేలం కేంద్రం నిర్వాహణాధికారి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శాఖవరంలో సోమవారం రేకలలోని క్యూరింగ్ అయిన పొగాకు నాణ్యతను ఆయన పరిశీలిచారు. ఈ సందర్భంగా రైతులకు ఏర్పాటు శిక్షణలో మాట్లాడుతూ ఆకులు అల్లేటప్పుడు పట్టలపై ఉంచాలన్నారు. క్యూరింగ్ మీటరు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. క్యూరింగ్ తరువాత పొగాకు కర్రలను పందిళ్ల కింద ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజరు ప్రవీణ్‌బాబు, రామాంజనేయులు, ఉన్నం శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

## 27న సర్వసభ్య సమావేశం

**ఉదయగిరిరూరల్, జనవరి 22:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించడం జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

## ప్రతి గ్రామానికి మంచినీరు అందించటమే లక్ష్యం



కొత్తపల్లి సచివాలయం వద్ద మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

**కావలి, జనవరి 22:** భవిష్యత్తులో మంచినీటిని ప్రతి గ్రామానికి అందించాలనే లక్ష్యంతో కేంద్రం జలజీవన్ మిషన్ పనిచేస్తున్నదని కేంద్ర అధికార బృందం సభ్యులు ఎస్‌పీ సేథీ, డాక్టర్ జైభగవాన్ తెలిపారు. కావలి రూరల్ మండలం కొత్తపల్లి, చలంచర్ల, చెన్నాయపాలెం, ఆముదాలదిన్నె గ్రామాల్లో సోమవారం వారు గ్రామీణ నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పర్యటించారు. జలజీవన్ మిషన్ అమలు, స్వచ్ఛభారత్ పథకాల అమలును వారు పరిశీలించారు. ఇప్పటికే ఈ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించి నీటి సరఫరా ఎలా ఉంది... అని స్థానికులను అడిగారు. స్వచ్ఛభారత్ అమలుపై సమీక్షించారు. ప్రజలను చైతన్యపరిచేలా స్థానిక పాలకులు కీలకపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిపారుదల ఏఈ కృష్ణచైతన్య ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన్‌రంగా విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి తదితరులు

**కావలిటౌన్, జనవరి22:** కాపు నాయకుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహ ప్రతిష్ఠకు సోమవారం పట్టణంలో భూమిపూజ జరిగింది. డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులో జరిగిన భూమిపూజలో రంగా సోదరుడి కుమారుడు వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు కావ్య కృష్ణారెడ్డి, జనసేన నాయకులు అళహరి సుధాకర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీను, ఆళ్ల కోటేశ్వరరావు, ఆళ్ల శ్రీను, నువ్వులశెట్టి జెస్సీష్, తదితరులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా భూమి పూజా కార్యక్రమం జరిగింది.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**కావలి రూరల్, జనవరి22:** అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన జూపూడి సాయికుమార్ (30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు, కావలి మండలం చెంచుగానిపాలెంకు చెందిన జూపూడి హరిప్రసాద్‌కు నలుగురు కుమారైలు, కుమారుడు సాయికుమార్ ఉన్నారు. సెంట్రింగ్ పనిచేసే సాయికుమార్ నెమ్ముతో బాధపడుతూ ఈనెల 20న గ్రామానికి వెళ్లే రోడ్డు ఆర్బీ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.దీంతో అతన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండ్రి హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం ఉండాలి



సంగీతను సత్కరిస్తున్న మహాకూటమి నాయకులు

**కలిగిరి, జనవరి 22:** క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, లోక్ అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వతరగతి విద్యార్థిని చలంచర్ల సంగీత ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపగా, సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం భీమేశ్వరరావు, పీఈటీ మురళి, జయంపు కనకయ్య, ఎన్ జయలక్ష్మి, తుమ్మల అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల ర్యాలీ

**కావలిటౌన్, జనవరి22:** దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ట్రంకురోడ్డులో దివ్యాంగులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో హక్కుల వేదిక నేతలు ఇనాయత్ హుస్సేన్, సోమయ్య, వేణు, మహిబూబ్ బాష పాల్గొన్నారు.

## ప్రచార కమిటీలో శ్రీనాథ్

**కావలిటౌన్, జనవరి22:** స్థానిక పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ రాయలసీమ జోన్-1 వారాహి ప్రచార కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు. సోమవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. తనకు సహకరించిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, జిల్లా నాయకులు కొట్టే వెంకటేశ్వర్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ ఉపకార వేతనానికి మనోజ్ ఎంపిక

**కొండాపురం, జనవరి22:** మండల పరిధిలోని గొట్టిగుండాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 8 వతరగతి చదువుతున్న వీ మనోజ్‌కుమార్ ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికయినట్లు హెచ్ఎం అమరేందర్ సోమవారం తెలిపారు. మనోజ్‌కు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్‌ను టీచర్లు, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

## నేడు మున్సిపల్ దుకాణాలకు వేలం

**కందుకూరు, జనవరి 22:** పట్టణంలోని రైతుబజారు పక్కన మున్సిపాలిటీ నిర్మించిన 18 రూములను అద్దెకు ఇచ్చేందుకు మంగళవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగవేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్. మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1,2,3 షాపులు ఎస్సీలకు, 5వ షాపు ఎస్టీలకు, 6 దివ్యాంగులకు, 7 నాయీబ్రాహ్మణులు లేదా వాషర్‌మెన్‌లకు రిజర్వ్ చేశామని, మిగిలిన రూములు జనరల్ కేటగిరిలో ఉంటాయని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 50వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

## పవన్‌ను సీఎం చేయటమే లక్ష్యం

**కావలి,జనవరి22:** జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను సీఎం చేయటమే తమ లక్ష్యమని జనసేన రాయలసీమ ఎలక్షన్ కమిటీ సభ్యులు సిద్దూ, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో జరుగుతోన్న అవినీతి, దోపిడీపై పలు ఉద్యమాలు చేపట్టామన్నారు. రాబోయే ఎన్నికల్లో కావలి టికెట్ ఎవరికి ఇచ్చినా ఐక్యమత్యంగా పనిచేసి ఆ అభ్యర్థి విజయం కోసం కృషిచేస్తామన్నారు. సమావేశంలో నేతలు తోట వెంకట శేషయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తిరుపతిస్వామి, ఆలూరు చంటి, విజయ్, రాజేష్, జయరాం, రామకృష్ణ పాల్గొన్నారు.

## నేడు లోకేష్ జన్మదిన వేడుకలు

**ఉదయగిరి రూరల్, జనవరి 22:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు చింతనబోయిన బయన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్ పాల్గొంటారన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.